


epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

సంపుటి : 19 సంచిక : 139 | 12-08-2026 బుధవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 8 వెల : రూ.1.00


# ప్రతి విద్యార్థికి ప్రపంచ స్థాయి విద్య



## యంగ్ ఇండియా స్కూల్స్ లక్ష్యం

## ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ వెల్లడి

తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేట్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో ఈ విద్యాలయాలు నిర్మితమవుతున్నా యని సీఎం వెల్లడించారు. 'భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి.

2 లో..







## కేరళ ఇక నుంచి కేరళంగా మార్పు

కేరళ రాష్ట్రం పేరును కేరళంగా మార్చేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలిపింది. విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే బిల్లును సభలో ప్రవేశపెట్టి మూజువాణి ఓటుతో ఆమోదించారు. రాష్ట్రం పేరును కేరళంగా మార్చాలని కోరుతూ కేరళ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది. అయితే, బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో విపక్ష సభ్యులు సభలో ఆందోళనకు దిగారు. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ బిల్లుపై పక్రియను కొనసాగించిన సభ.. చివరకు మూజువాణి ఓటుతో ఆమోదించింది.

2



## జార్ఖండ్ లాఠీఛార్జ్ సమర్థనీయమే

### పరిస్థితిని అదుపు చేసేందుకు తప్పదు

### సమర్థించుకున్న రాష్ట్ర పోలీస్ విభాగం

రాంచీలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైన విద్యార్థుల ర్యాలీకి అడ్డంకులు సృష్టించిన వారి వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తుం న్నారు. అయితే, అసెంబ్లీ వైపు పెద్ద సంఖ్యలో వస్తున్న విద్యార్థులను అదుపు చేసేందుకు పరిమితస్థాయిలో బలప్రయోగాన్ని రాష్ట్ర పోలీసు వర్గాలు సమర్థించుకున్నాయి. ర్యాలీ సందర్భంగా పోలీసులు వాటర్ క్యానన్, భాష్పవాయువును ప్రయోగించారు. లాఠీ చార్జ్ కూడా జరిగింది. రోడ్డు క్లియర్ చేయాలని పదే పదే అభ్యర్థించినా నిరసన కారులు పట్టించుకోలేదని పోలీసు వర్గాలు తెలిపాయి.

2

## రేవంత్ షెల్ కంపెనీల బాగోతం

### త్వరలోనే బండారం బయటపెడతాం

### సిఎం సోదరులంతా పెద్దపెద్ద కంపెనీ ఓనర్లు: కెటిఆర్



2

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులంతా పెద్ద పెద్ద కంపెనీలకు యజమానుల వుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక్క ఉద్యోగి కూడా లేకుండా కొత్తకొత్త కంపెనీలు ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. సీఎం సోదరులు చిన్నచిన్న ఇంటి అడ్రస్‌లతో పెద్దపెద్ద కంపెనీలు రిజిస్ట్రేషన్ చేయించారు. అలాంటి ఊరుపేరు లేని కంపెనీలకు రాష్ట్రప్రభుత్వం రూ.200 కోట్ల విలువైన 5 ఎకరాల భూమి కేటాయించింది.



2

## ఆంక్షల వ్యసనంలో అమెరికా

తమ దేశంపై ఆంక్షలు విధించడం అమెరికాకు వ్యసనంగా మారిందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి విమర్శించారు. ఆంక్షలతో ఇరాన్‌ను 'ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాం' అని అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ చెప్పడంపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

## విషాదాన్ని మిగిల్చిన కొలంబియా భూకంపం

### 132కు చేరిన మృతుల సంఖ్య

### శిథిలాల కింద పెద్ద సంఖ్యలో ప్రజలు

### సహాయక చర్యలు ముమ్మరం చేసిన ప్రభుత్వం



2



2

## ఇరాన్ నుంచి పొంచివున్న ముప్పు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత నెలలో టర్కీ పర్యటన ముగించుకుని తిరిగి వెళ్తున్నప్పుడు బ్రిటన్ కు అత్యంత రహస్యంగా ప్రయాణించినట్లు 'వాషింగ్టన్ పోస్ట్ ' ఒక సంచలన కథనాన్ని ప్రచురించింది. ఇరాన్ నుంచి ముప్పు పొంచి ఉందన్న హెచ్చరికల భయంతో ఆయన అందరూ భావించినట్లు ఎయిర్‌ఫోర్స్ వన్‌లో కాకుండా మరో సైనిక విమానంలో రహస్యంగా ప్రయాణించారని ఆ కథనం పేర్కొన్నది.

2



## గల్లంతైన 65 లక్షల ఓట్లలో నాది కూడా ఉంది


బెంగళూర్‌లో గల్లంతైన 65 లక్షల ఓట్లలో తనది కూడా ఉందని నటుడు ప్రకాశ్ రాజ్ తెలిపారు. ఈ విషయంపై సోషల్ మీడియాలో ఓ సెల్ఫీ వీడియోను పంచుకున్నారు. ప్రత్యేక సమగ్ర సవరణపై మాట్లాడారు.

## యూపిఐ పేమెంట్స్‌పై ఛార్జీలు ఉండవు

### కమ్యూనిస్టులు అబద్ధాల ప్రచారం తగదన్న నిర్మల

**న్యూఢిల్లీ,**

రూపే, గూగుల్‌పే, ఫోన్‌పే వంటి యూన్గి÷డ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)ల ద్వారా జరిపే లావాదేవీలకు ఛార్జీలు వసూలు చేస్తారన్న అనుమానాలపై ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. ముఖ్యంగా కమ్యూనిస్టులు ఇలాంటివి ప్రచారం చేయడంలో ముందుంటారని ఎద్దేవా చేశారు. వీటిని ఉపయోగించే వినియోగదారుల నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయబోరని పేర్కొన్నారు. కొన్ని రకాల లావాదేవీలకు మాత్రర భవిష్యత్తులో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వసూలు చేసే అవకాశం ఉందని తెలిపారు. దీనిని ఇంకా ఖరారు చేయలేదని, తరువాత నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. ఛార్జీలు వసూలు చేసేందుకు వీలు కలిగేంచేలా చట్టాన్ని సవరించామే తప్ప, వినియోగదారుల నుంచి ఇప్పటికిప్పుడు వసూలు చేయడానికి కాదని చెప్పారు. ఏ వస్తువుపై ఎండీఆర్ వసూలు చేయాలి, ఎంత ధరకు పరిమితం చేయాలన్న దాన్ని తరువాత నిర్ణయిస్తామని తెలిపారు. యూపీఐ విధానాన్ని 2016లో ప్రారంభించగా, అప్పటి నుంచి ఉచితంగా సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. అది కొనసాగుతుందని తెలిపారు. చిరు వ్యాపారులపై భారం పడబోదన్నారు. అమెరికా ఒత్తిడి మేరకే యూపీఐ చెల్లింపులపై రుసుములు వసూలు చేయాలని నిర్ణయించారని సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఆరోపించారు.



2

## దివంగత ప్రధాని మన్మోహన్ ప్రభావశీలి

కోల్‌స్కామ్‌లో క్లీన్‌చిట్‌పై సోనియా కీలక వ్యాఖ్యలు మోడీ ఇకనైనా తనను తాను క్షమించుకోవాలంటూ చురక

# కేరళ ఇకనుంచి కేరళంగా మార్పు

## లోక్‌సభలో మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

కేరళ రాష్ట్రం పేరును కేరళంగా మార్చేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలిపింది. విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే బిల్లును సభలో ప్రవేశపెట్టి మూజువాణి ఓటుతో ఆమోదించారు. రాష్ట్రం పేరును కేరళంగా మార్చాలని కోరుతూ కేరళ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది. అయితే, బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో విపక్ష సభ్యులు సభలో ఆందోళనకు దిగారు. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ బిల్లుపై ప్రక్రియను కొనసాగించిన సభ.. చివరకు మూజువాణి ఓటుతో ఆమోదించింది. తదుపరి ప్రక్రియలో భాగంగా బిల్లును రాజ్యసభకు పంపనున్నారు. రాష్ట్ర అధికారిక పేరును మలయాళంలో 'కేరళం'గా ఉపయోగిస్తున్న నేపథ్యంలో అదే పేరును రాజ్యాంగపరంగానూ అమలు చేయాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉంది. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకొచ్చిన సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించింది. కాగా, ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పోలీస్ చర్యలకు గాను పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి.

# జార్ఖండ్ లాఠీచార్జ్ సమర్థనీయమే

## పరిస్థితిని అదుపు చేసేందుకు తప్పదు

## సమర్థించుకున్న రాష్ట్ర పోలీస్ విభాగం

**రాంచీ, అక్షరకలం ప్రతినిధి**

రాంచీలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైన విద్యార్థుల ర్యాలీకి అడ్డంకులు సృష్టించిన వారి వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. అయితే, అసెంబ్లీ వైపు పెద్ద సంఖ్యలో వస్తున్న విద్యార్థులను అదుపు చేసేందుకు పరిమితస్థాయిలో బలప్రయోగాన్ని రాష్ట్ర పోలీసు వర్గాలు సమర్థించుకున్నాయి. ర్యాలీ సందర్భంగా పోలీసులు వాటర్ క్యానన్, భాష్పవాయువును ప్రయోగించారు. లాఠీ చార్జ్ కూడా జరిగింది. రోడ్డు క్లియర్ చేయాలని పదే పదే అభ్యర్థించినా నిరసన కారులు పట్టించుకోలేదని పోలీసు వర్గాలు తెలిపాయి. కొందరు బ్యారికేడ్లను ధ్వంసం చేశారని, వాహనాలను అడ్డుకున్నారని ఆరోపించాయి. మరోవైపు, ఎలాంటి హెచ్చరికలు లేకుండానే పోలీసులు బలప్రయోగానికి దిగారని విద్యార్థులు ఆరోపించారు. లాఠీ చార్జ్ సందర్భంగా కనీసం 100 మందికిపైగా విద్యార్థులపై పోలీసులు లాఠీ చార్జ్ చేశారని ఓ యువకుడు ఆరోపించారు. పరస్పర ఆరోపణల నేపథ్యంలో ర్యాలీకి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు. అడ్డంకులు సృష్టించిన వారు ఎవరో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సోమవారం నాటి నిరసనల్లో 14 మంది పోలీసులకు గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. ఒకరికి తీవ్ర గాయమైందని అన్నారు. అయితే, పరిస్థితిని అదుపు చేసేందుకు వీలైనంత పరిమితిస్థాయిలోనే బలప్రయోగం చేశామని రాంచీ ఎస్ఎస్‌పీ రాకేశ్ రంజన్ చెప్పారు.

# ఇరాన్ నుంచి పొంచివున్న ముప్పు

## సైనిక విమానంలో ట్రంప్ రహస్య ప్రయాణం

## 'వాషింగ్టన్ పోస్ట్ ' ఒక సంచలన కథనం

**వాషింగ్టన్, అక్షరకలం ప్రతినిధి**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత నెలలో టర్కీ పర్యటన ముగించుకుని తిరిగి వెళుతున్నప్పుడు బ్రిటన్ కు అత్యంత రహస్యంగా ప్రయాణించినట్లు 'వాషింగ్టన్ పోస్ట్ ' ఒక సంచలన కథనాన్ని ప్రచురించింది. ఇరాన్ నుంచి ముప్పు పొంచి ఉందన్న హెచ్చరికల భయంతో ఆయన అందరూ భావించినట్లు ఎయిర్‌ఫోర్స్ వన్‌లో కాకుండా మరో సైనిక విమానంలో రహస్యంగా ప్రయాణించారని ఆ కథనం పేర్కొన్నది. వివరాల్లోకి వెళ్తే.. టర్కీ రాజధాని అంకారాలో నాటో సదస్సు ముగిశాక ట్రంప్.. కెమెరాల ముందు పాత ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం ఎక్కారు. అయితే ఆ తర్వాత ఆయనను ఒక ఎయిర్‌పోర్ట్ క్యాటరింగ్ ట్రక్కు ద్వారా రహస్యంగా మరోచోట ఉన్న చిన్న సైనిక విమానం (ఎయిర్‌ఫోర్స్ సి-32ఏ) వద్దకు తరలించారు. ఆ విమానంలోనే ఆయన బ్రిటన్‌కు చేరుకున్నారని అమెరికా అధికారులను ఉటంకిస్తూ వాషింగ్టన్ పోస్ట్ తెలిపింది. ట్రంప్ ప్రయాణిస్తున్నట్లు అందరూ భావించిన ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం కూడా కొన్ని నిమిషాల తేడాతో అక్కడికి చేరుకుంది. పాత జ్ఞాపకాల కోసం ఈ విమానంలో ప్రయాణిస్తున్నట్లు ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో పోస్ట్ చేసినప్పటికీ అసలు కారణం ఇరాన్ నుంచి పొంచి ఉన్న భద్రతా ముప్పేనని స్పష్టమవుతోంది. ఈ కథనంపై వైట్‌హౌస్ స్పందిస్తూ.. 'అధ్యక్షుడిపై అమెరికా శత్రువులు కన్నేశారు. వారి నుంచి రక్షణ కల్పించడానికి మా వద్ద ఉన్న అన్ని మార్గాలను ఉపయోగిస్తాం' అని కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవ్ చుంగ్ ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ఈ రహస్య ప్రయాణంపై పెంటగన్ ఇంకా స్పందించలేదు.

# ఆంక్షల వ్యసనంలో అమెరికా

## దౌత్య మార్గంలో విఫలంతో ఆంక్షల కొరడా

## ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి

**టెహ్రాన్, అక్షరకలం ప్రతినిధి**

తమ దేశంపై ఆంక్షలు విధించడం అమెరికాకు వ్యసనంగా మారిందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి విమర్శించారు. ఆంక్షలతో ఇరాన్‌ను 'ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాం' అని అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ చెప్పడంపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దౌత్య మార్గంలో లక్ష్యాలను సాధించలేనప్పుడల్లా అమెరికా ఆంక్షలు విధిస్తోందని ఆరోపించారు. అవి ఫలించకపోతే మరింత తీవ్రత పెంచుతోందని పేర్కొన్నారు. ఇది ఒక అలవాటుగా, చివరకు వ్యసనంగా మారిందని ఎక్స్ వేదికగా ఆయన మండిపడ్డారు. ఆంక్షలతో ఇరాన్‌ను లొంగదీసుకోవడం సాధ్యం కాదని బఘాయి స్పష్టం చేశారు. దశాబ్దాలుగా ఇలాంటి ఆంక్షలను ఎదుర్కొంటూనే ఉన్నామన్నారు. అమెరికా నేతలు ఈ చెడు అలవాటును కొనసాగిస్తే.. సంక్షోభం నుంచి గౌరవప్రదంగా బయటపడే అవకాశాలను వారే దెబ్బతీసుకుంటారని హెచ్చరించారు. మరోవైపు ఇరాన్ ప్రభుత్వం డిజిటల్ ఆస్తులు, రహస్య బ్యాంకింగ్ నెట్‌వర్క్‌లపై ఆధారపడుతోందని స్కాట్ బెసెంట్ ఆరోపించారు. వారి అక్రమ ఆర్థిక నెట్‌వర్క్‌లను గుర్తించి ధ్వంసం చేస్తామని తెలిపారు. ఇరాన్ సైన్యంలో కీలక నియామకాలు జరిగాయి. సుప్రీం నేత మొజ్తబా ఖమేనీ ఈ మార్పులు చేశారు. మేజర్ జనరల్ అలీ అబ్దొల్లాహీని సాయుధ దళాల చీఫ్‌గా, కియుమర్స్ హైదారిని డిప్యూటీగా నియమించారు. అలాగే ఐఆర్‌జీసీ కమాండర్‌గా మేజర్ జనరల్ అహ్మద్ వాహిదీ, డిప్యూటీగా మోస్తఫా ఇజాదీ బాధ్యతలు చేపట్టారు. మొజ్తబా సుప్రీం నేతగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సైన్యంలో చేసిన తొలి కీలక నియామకాలు ఇవే కావడం గమనార్హం.

# దివంగత ప్రధాని మన్మోహన్ ప్రభావశీలి

## కోల్‌స్కామ్‌లో క్లీన్‌చిట్‌పై సోనియా కీలక వ్యాఖ్యలు

## మోడీ ఇకనైనా తనను తాను క్షమించుకోవాలంటూ చురక

**న్యూఢిల్లీ,**

కోల్ స్కామ్ కేసులో దివంగత నేత, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సుప్రీం కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంపై కాంగ్రెస్ నేత సోనియా గాంధీ మంగళవారం కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ ప్రధాని సింగ్‌ను అత్యంత ప్రభావశీలమైన ప్రధానిగా, మృదుస్వభావిగా చరిత్ర ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ప్రభుత్వంతో పోలిస్తే ఆయన తన నైతికత, జవాబుదారితనంతో పూర్తి భిన్నమైన వ్యక్తిగా కనిపిస్తారని అన్నారు. ఈ తీర్పుతో భారత రాజకీయంలో ఒక విషాదకర ఘట్టానికి ముగింపు పడిందని వ్యాఖ్యానించారు. నీతినిజాయతీ కలిగిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నానికి ఫుల్ స్టాప్ పడిందని వ్యాఖ్యానించారు. 'దివంగత నేత మన్మోహన్ సింగ్‌కు వ్యతిరేకంగా ఒక లాబీ పూర్తిసన్నద్ధతతో, సమన్వయంతో పనిచేసింది. అధికార గణం మొదలు న్యాయవ్యవస్థకు చెందిన వారు, పౌర సమాజం, ఆర్‌ఎస్‌ఎస్ బీజేపీ అందరూ ఉన్నారు. నాటి ఆరోపణలన్నీ బోగస్ అని నేడు రుజువైంది. డా. మన్మోహన్ సింగ్ నిర్దోషి అన్న విషయం స్పష్టంగా తేలింది' అని ఓ జాతీయ వార్త పత్రికలోని వ్యాసంలో సోనియా గాంధీ రాసుకొచ్చారు. ప్రత్యర్థులను టార్గెట్ చేసేందుకు ఈడీ, సీబీఐ వంటి సంస్థలను మోడీ ప్రభుత్వం దుర్వినియోగపరిచిందని కూడా ఎంపీ సోనియా గాంధీ ఆరోపించారు. 'వాటి లక్ష్యం ప్రత్యర్థులపై ఒత్తిడి తేవడమే. కొందరి గొంతు నొక్కారు.

# ప్రతి విద్యార్థికి ప్రపంచస్థాయి విద్య

## యంగ్ ఇండియా స్కూల్స్ లక్ష్యం ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ వెల్లడి



**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేట్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో ఈ విద్యాలయాలు నిర్మితమవుతున్నాయని సీఎం వెల్లడించారు. 'భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి. ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ.. కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ.. ప్రతి చిన్నారికి ప్రపంచ స్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు.. పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయి. పేద పిల్లల కలలకు చిరునామాగా... తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా... యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి' అంటూ ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.

# రేవంత్ షెల్ కంపెనీల బాగోతం

## త్వరలోనే బండారం బయటపెడతాం

## సీఎం సోదరులంతా పెద్దపెద్ద కంపెనీ ఓనర్లు: కెటిఆర్

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులంతా పెద్ద పెద్ద కంపెనీలకు యజమానులవుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక్క ఉద్యోగి కూడా లేకుండా కొత్తకొత్త కంపెనీలు ఏర్పాటుచేస్తున్నారని విమర్శించారు.సీఎం సోదరులు చిన్నచిన్న ఇంటి అడ్రస్‌లతో పెద్దపెద్ద కంపెనీలు రిజిస్ట్రేషన్ చేయించారు. అలాంటి ఊరుపేరు లేని కంపెనీలకు రాష్ట్రప్రభుత్వం రూ.200 కోట్ల విలువైన 5 ఎకరాల భూమి కేటాయించింది. అనుముల కొండల్‌రెడ్డి టెసరాక్ కంపెనీ ఛైర్మన్ అని లింక్‌డిన్ ప్రొఫైల్‌లో పెట్టుకున్నారు. సీఎం మరో సోదరుడు జగదీశ్‌రెడ్డి కాంట్రాక్టులు చేసుకుంటున్నారు. సీఎం బామ్మర్ది సృజన్‌రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్టు ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ షెల్ కంపెనీల బాగోతాన్ని బయటపెడతామని హెచ్చరించారు.మంగళవారంతెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. అనుముల కొండల్‌రెడ్డి టెస్రాక్ట్ సంస్థకు ఛైర్మన్‌గా ఉన్నానని ఆయనే చెప్పారని అన్నారు. రేవంత్ బ్రదర్స్ సూటు బూట్లతో కంపెనీలు ఎలా పెట్టారని ప్రశ్నించారు. టెస్రాక్ట్ కంపెనీలో ఒక్క ఎంప్లాయి కూడా లేరని.. లక్ష రూపాయలతో ఆ కంపెనీ పెట్టడం ఎలా సాధ్యమని నిలదీశారు. ఆ కంపెనీకి వేల కోట్ల భూములు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. రూ.2వేల కోట్ల విలువ చేసే స్థలాన్ని రూ.7 వేల కోట్లకు కేటాయించారని ప్రస్తావించారు. ఆ కంపెనీకి కొండల్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు ఎలా చెబుతారని నిలదీశారు. శ్రీధర్‌బాబుకి తన శాఖలో ఏం జరుగుతుందో తెలియదా.? లేక సీఎం వత్తిడికి తలొగ్గరా అని ప్రశ్నల వర్షం కురిపించారు. కర్ణాటకలో అక్కడి ప్రభుత్వం సీఎం భార్యకు మూడెఎకరాలు కేటాయించడంపై కేసు నమోదైందని తెలిపారు. ముడా స్కాంలో సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. అనుముల కొండల రెడ్డి టెస్రాక్ట్ సంస్థ కి ఛైర్మన్‌గా ఆయనే పేర్కొన్నారు. కొండల్‌రెడ్డికి సంబంధం లేకుంటే యూఎస్ కౌన్సిల్ మీటింగ్‌కి ఎలా వెళ్లారని నిలదీశారు. ఈ భూ కేటాయింపులను వదలబోమని వార్నింగ్ ఇచ్చారు. తిరుపతిరెడ్డి ఏ హోదాలో అధికారిక సమావేశాలకు వెళ్తారని ప్రశ్నించారు. ప్రజలకు పట్టాలు ఏ హోదాలో ఇస్తారని నిలదీశారు. రాష్ట్ర గవర్నర్‌నీ కలిసి ఈ విషయంపై విచారణ జరపాలని కోరతామని అన్నారు. 74 లక్షల ఓట్లు తొలగిస్తారనేది ఆందోళనకరమైన విషయమని చెప్పుకొచ్చారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల తర్వాత పార్టీ నేతలు న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అర్హుల ఓట్లు కోల్పోకుండా చూస్తామని అన్నారు. తెలంగాణకు అన్యాయం చేసే జీఆర్ఎంబీ మీటింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం వెళ్తుందా లేదా స్పష్టం చేయాలన్నారు. జలసౌదాలో జరిగే జీఆర్ఎంబీ అజెండా మార్చుకుంటే జలసౌధను ముట్టడిస్తామని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కి జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్ర చెప్పినా బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. వరుణ యాగం చేయడం తప్పు కాదు కానీ ప్రభుత్వం చేయాల్సిన పని చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు.

# నేడు పలు దేశాల్లో సంపూర్ణ సూర్యగ్రహణం

## భారత్‌లో కనిపించదని వెల్లడి

**న్యూఢిల్లీ**

ఆగస్టు 12వ తేదీ బుధవారం ఆషాఢ అమావాస్య ఒకటయితే ..ఇదే రోజు సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడనుంది. అయితే ఇది భారత్‌లో కనిపించదు. మొత్తం 55 దేశాల్లో సంపూర్ణంగా కనిపిస్తుంది. 33 దేశాల్లో పాక్షికంగా కనిపిస్తుంది. స్టేషన్ నోర్డ్, సఫ్జార్, బోర్గార్నాస్ , రెక్జావిక్, కెప్లావ్క్, సాన్టాండర్, బిల్బావో, గిజోన్, ఒవిడో, విటోరియా గస్టీజ్, ఎ కొరువా, లుగో, లోగ్రూ, బుర్గోస్, పోన్‌ఫెరాడా, జరాగో తదితర దేశాల్లో సంపూర్ణ సూర్యగ్రహం కనిపిస్తుంది. ఐరోపాలోని పలు ప్రాంతాలు, వాయువ్య ఆఫ్రికా, ఉత్తర అమెరికాలోని కొన్ని భాగాల్లో పాక్షికంగా గ్రహణం కనిపిస్తుంది. ఈ గ్రహణం అసాధారణమైనదని ఐరోపాలోని ఖగోళ శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. స్పెయిన్‌తో సహా ఐరోపా ఖండంలోని కొన్ని ప్రాంతాల్లో సూర్యాస్తమయానికి దగ్గరగా ఈ గ్రహణం సంభవిస్తుంది. దీని వల్ల సాయంకాలం ఆకాశంలో సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడనుంది. అయితే ఈ గ్రహణాన్ని వీక్షించే వారు తప్పని సరిగా జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. గ్రహణం పట్టిన సూర్యుడిని నేరుగా చూడటం వల్ల కంటికి నష్టం జరిగే అవకాశం అధికంగా ఉంటుంది. భారత్‌లో ఈ సూర్యగ్రహణం కనిపించదు. అలాగే దీఇనికి సంబంధించి ఎలాంటి ఆందోళనా వలదని అంటున్నారు. భారత్‌లో 2034, మార్చి 20న సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడనుంది. ఇది ఆసియా అంతటా కొనసాగే ముందు భారత్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, సౌదీ అరేబియా, ఈజిప్ట్, ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో కనిపించనుంది.

# ప్రభుత్వ కార్యక్రమాలలో తొలుత తమిళత్తాయ్ గీతాలాపన

**చెన్నై,**

తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌పై ప్రముఖ నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ ప్రశంసలు కురిపించారు. ప్రభుత్వ కార్యక్రమాలలో తమిళత్తాయ్ గీతాన్ని మొదటగా ఆలపించాలనే తీర్మానాన్ని శాసనసభ ఆమోదించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు కమల్ హాసన్ తన ఎక్స్ ఖాతాలో మంగళవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'ప్రభుత్వ కార్యక్రమాలలో తమిళత్తాయ్ గీతాన్ని మొదటగా ఆలపించాలనే తీర్మానాన్ని శాసనసభలో ఆమోదించడం సంతోషకరం.

# విషాదాన్ని మిగిల్చిన కొలంబియా భూకంపం

## 132కు చేరిన మృతుల సంఖ్య

## శిథిలాల కింద పెద్ద సంఖ్యలో ప్రజలు

## సహాయక చర్యలు ముమ్మరం చేసిన ప్రభుత్వం



**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

కొలంబియాలో భారీ భూకంపం పెను విషాదాన్ని మిగిల్చింది. సోమవారం పశ్చిమ కొలంబియాలో 7.4 తీవ్రతతో ఏర్పడిన భూకంపం ధాటికి మరణించిన వారి సంఖ్య 132కు చేరింది. మరో 570 మంది గాయపడ్డారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. భూకంప కేంద్రం చోకో ప్రాంతంలోని శాన్ జోసె డెల్ పాల్మార్ సమీపంలో ఉన్నట్టు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. భూకంపం సుమారు 107 కిలోమీటర్ల లోతులో సంభవించింది. దీని ప్రకంపనలు కొలంబియాలోని కాలీ, పెరీరా, మానిజాలెస్, బొగోటా తదితర ప్రాంతాలతోపాటు పొరుగు దేశాల్లోనూ నమోదయ్యాయి. భూకంప ధాటికి అనేక ప్రాంతాల్లో భవనాలు కుప్పకూలాయి. కాలీలోని ఓ ఆసుపత్రిలో పీడియాట్రిక్, నియోనేటల్ విభాగాలు దెబ్బతిన్నాయి.శిథిలాల కింద చిక్కుకున్న పలువురిని రక్షణ సిబ్బంది వెలికితీశారు. ఆసుపత్రుల్లోని కొంతమంది రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాలీలోనే 30 శాతం వరకు ఆసుపత్రి నిర్మాణం దెబ్బతిన్నట్టు స్థానిక అధికారులు తెలిపారు. పెరీరా, కాలీ నగరాల్లో భవనాల కూలిపోవడంతో భారీగా ప్రాణనష్టం సంభవించింది. మానిజాలెస్‌లోని చారిత్రక కేథడ్రల్ టవర్ ఒకటి కూలిపోయింది. పలు ఇళ్లు, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు కూడా దెబ్బతిన్నాయి. భూకంప తీవ్రత దృష్ట్యా కొలంబియా ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించింది. సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు సైనిక బలగాలను రంగంలోకి దించింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని సజీవంగా బయటకు తీసుకురావడమే తమ తొలి ప్రాధాన్యమని అధ్యక్షుడు అబెలార్డో డి లా ఎస్ప్రియెల్లా తెలిపారు. సైన్యం ప్రత్యేక శిక్షణ పొందిన రెస్క్యూ సిబ్బంది, శిథిలాల్లో చిక్కుకున్న వారిని గుర్తించే పరికరాలు, శునక దళాలను రంగంలోకి దించింది. రిమోట్ ప్రాంతాల్లో రహదారులు, సమాచార వ్యవస్థలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. భూకంపం కారణంగా పశ్చిమ కొలంబియాలోని పలు విమానాశ్రయాల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. పెరీరా, మానిజాలెస్, ఆర్మేనియా, కార్టాగో, బ్యూనవెంచురా తదితర విమానాశ్రయాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల వైద్య, ప్రభుత్వ విమానాలకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. మరోవైపు కొలంబియాకు సాయం చేసేందుకు పలు దేశాలు ముందుకొచ్చాయి. ఈక్వెడార్ 47 మంది రెస్క్యూ సిబ్బంది, శిక్షణ పొందిన శునకాలు, ప్రత్యేక పరికరాలను పంపేందుకు సిద్ధమైంది. ఎల్ సాల్వడార్, మెక్సికోతోపాటు అమెరికా కూడా అవసరమైన సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించింది.

# గల్లంతైన 65 లక్షల ఓట్లలో నాది కూడా ఉంది

**బెంగళూరు,**

బెంగళూర్‌లో గల్లంతైన 65 లక్షల ఓట్లలో తనది కూడా ఉందని నటుడు ప్రకాశ్ రాజ్ తెలిపారు. ఈ విషయంపై సోషల్ మీడియాలో ఓ సెల్ఫీ వీడియోను పంచుకున్నారు. ప్రత్యేక సమగ్ర సవరణపై మాట్లాడారు. సర్' తర్వాత బెంగళూరు నియోజకవర్గంలో తొలగించిన 65 లక్షల ఓట్లలో నాది కూడా ఉంది. ఇది చాలా హాస్యాస్పదంగా అనిపిస్తోంది. నేను ఈ నియోజకవర్గంలోనే పుట్టాను. ఇక్కడే నివసించాను. చదువంతా ఇక్కడే పూర్తయింది. నటన నేర్చుకుంది కూడా ఇక్కడే. అన్నిటికంటే ముఖ్యంగా.. నేను ఈ నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థిగా కూడా పోటీ చేశాను. అయినా నా ఓటును తొలగించారని ఆ వీడియోలో చెప్పారు. మళ్లీ ఓటర్ కార్డు పొందడానికి ఏ డాక్యుమెంట్లు అడుగుతారో అని వ్యంగ్యంగా అన్నారు. తాను అన్నిటికీ సిద్ధంగా ఉన్నానని చెప్పారు. 'మీకు ఓటు వేయని వారిని తొలగించే అధికారం మీకు ఉండొచ్చు. కానీ మిమ్మల్ని అధికారం నుంచి దింపకుండా మమ్మల్ని ఆపగలరా?' అని గేమ్ ఆన్ అంటూ ప్రశ్నించారు. ఇక ప్రకాశ్ రాజ్‌కు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణతో సహా నాలుగు రాష్ట్రాల్లో ఓటరు కార్డులు ఉన్నాయనే ఆరోపణలపై ఇటీవల బెంగళూరులో కేసు నమోదైంది. నోటీసులకు స్పందించకపోవడంతో ఆయనపై నాన్-బెయిలబుల్ వారెంట్ కూడా జారీ చేశారు. ఈ కేసులో జులైలో బెంగళూరు కోర్టు ముందు ప్రకాశ్ రాజ్ హాజరుకాగా.. వాదనలు విన్న న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.

# పింఛన్ల దరఖాస్తు గడువు ఆగస్టు 31 వరకు .. ఎంపీడీవో ప్రభాకర్ రావు



చేయూత పింఛన్ల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని ఎంపీడీవో ప్రభాకర్ రావు తెలిపారు. అర్హులైన ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులతో పాటు తల సేమియా, ఫైలేరియా బాధితులు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పింఛన్ దరఖాస్తు తో పాటు సంబంధిత ధ్రువపత్రాలను జత చేసి ఈనెల 31 లోపు గ్రామపంచాయతీ కార్యాలయంలో అందజేయాలని కోరారు. దరఖాస్తులను అధికారులు ఆన్లైన్లో నమోదు చేస్తారని తెలిపారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి.. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11:**

జిల్లాలో ఆగస్టు 15వ తేదీన నిర్వహించనున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డిసిపి ఎ భాస్కర్, జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు లతో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలోని సమీకృత కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి వేడుకలను విజయవంతం చేయాలని తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గౌరవ వందనం, మంచిర్యాల, నస్పూర్ మండలాల తహశీల్దార్ల సంయుక్త ఆధ్వర్యంలో కుర్చీలు, ఇతర ఏర్పాట్లు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో త్రాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, జిల్లా పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో ముఖ్య అతిధి సందేశం, జిల్లా విద్యాధికారి ఆధ్వర్యంలో జాతీయ గీతాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అధికారులు, అనధికారులు, ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, ప్రశంసా పత్రాల గ్రహీతలు, ప్రజలు కూర్చునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రశంసా పత్రాల పంపిణీ, పతాక ఆవిష్కరణ, వేదిక అలంకరణ, పుష్పగుచ్చాలు, వేదిక తయారీ, టెంట్, కుర్చీలు, సౌండ్ సిస్టం, మైక్, ప్రోటోకాల్ ప్రకారంగా ప్రముఖుల ఆహ్వానం, నిరంతర విద్యుత్ సరఫరా, అత్యవసర ఏర్పాట్లు, అగ్నిమాపక, వైద్య సేవలు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని, వేడుకలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేసే దిశగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, మంచిర్యాల ఏసిపి ప్రకాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యావ్యవస్థను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11:**

ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసి విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పథకం, వంటశాల, రిజిస్టర్లు, పారిశుద్ధ్య నిర్వహణ అంశాలను పరిశీలించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసే చర్యలలో భాగంగా చేపట్టిన అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున పాఠశాల పరిసరాలు పరిశు భ్రంగా ఉంచాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం ముల్కల్ల లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్య బోధన అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11:**

జిల్లాలోని బెల్లంపల్లి, మందమర్రి శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలలో బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడంతో పాటు, బోనాల పండుగ విశిష్టతను తెలియజేసేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలు సమర్పించారు. అమ్మవారి, పోతురాజుల వేషధారణలో అలరించడం, బోనాల పాటలకు నృత్య ప్రదర్శనలు చేయడం వంటి కార్యక్రమాలతో అందరిని ఆకట్టుకున్నారు. పాఠశాల ఆవరణలో భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ వేడుకలను నిర్వహించారు.



పాఠశాల ఏజీఎం ఏ అరవింద్ రెడ్డి, బెల్లంపల్లి, మందమర్రి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు, జి సంజీవ్ లు మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలు, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. బోనాల వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన వారిని డైరెక్టర్ శ్రీవిద్య, చైర్మన్ మల్లంపల్లి శ్రీధర్, ఏజీఎం అరవింద్ రెడ్డి, కోఆర్డినేటర్ నాగరాజు లు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ ప్రదీప్, రవితేజ, ప్రైమరీ ఇన్‌చార్జి, సౌజన్య, నూకల సునీత ప్రీ-ప్రైమరీ ఇన్‌చార్జి, పల్లవి, తిరుమల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీలు సహకరించాలి.. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11:**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ- 2026 ప్రక్రియలో స్పష్టమైన జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బిఎల్ఓలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ, మార్పులు--చేర్పులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అక్టోబర్ 1, 2026 ను అర్హత తేదీగా చేపడుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ--2026 ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని చెన్నూరు (ఎస్సి), బెల్లంపల్లి (ఎస్సి), మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గాలలో పోలింగ్ కేంద్రాల ప్రతిపాదిత మార్పులు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పేర్ల మార్పు తదితర వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించడం



జరిగిందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 747 పోలింగ్ కేంద్రాలకు అదనంగా 18 కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం, 22 పోలింగ్ కేంద్రాల స్థానాలను మార్చడం, ఒక పోలింగ్ కేంద్రం పేరును మార్చడం ప్రతిపాదించగా మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 765 కు చేరనుందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గంలో 230 నుంచి 235, బెల్లంపల్లి నియోజకవర్గంలో 227 నుంచి 231, మంచిర్యాల నియోజకవర్గంలో 290 నుంచి 299 పోలింగ్ కేంద్రాల సంఖ్య పెరగనుందని తెలిపారు. ఎన్నికల సంఘం సవరించిన కార్యాచరణ ప్రకారం ముసాయిదా ఓటర్ల జాబితా ఆగస్టు 17వ తేదీ ప్రచురించబడుతుందని, ఆగస్టు 17 నుండి సెప్టెంబర్ 16వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుందని, వాటి పరిష్కార ప్రక్రియ అక్టోబర్ 15వ తేదీ వరకు కొనసాగుతుందని, తుది ఓటర్ల జాబితా అక్టోబర్ 19వ తేదీన ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వివరాలను పరిశీలించి, ఏవైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే నిర్ణీత గడువులోగా సంబంధిత ఎన్నికల అధికారులకు సమర్పించాలని సూచించారు. ఎస్ఐఆర్.--2026 ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవీ పరీక్షలకు డిజిటల్ విధానం క్యూఆర్ కోడ్‌తో సులభంగా సేవలు పోస్టర్ విడుదల చేసిన.... - కలెక్టర్ ప్రతిమాసింగ్.....

**మెదక్,ఆగస్టు 11(అక్షర కలం):**



మంగళవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో క్యూ ఆర్ కోడ్ సేవల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ హెచ్ఐవీ (ఎయిడ్స్)పై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, అవసరమైన వారికి పరీక్షలు మరియు సేవలను మరింత సులభంగా అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో డిజిటల్ విధానాన్ని అందుబాటులోకి వస్తుందన్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా సమీపంలోని హెచ్ఐవీ పరీక్షా కేంద్రాలు, అందుబాటులో ఉన్న సేవలు తదితర వివరాలను తెలుసుకునే అవకాశం ఉంటుందనీ, హెచ్ఐవీపై అనుమానం ఉన్న వారు భయపడకుండా, గోప్యతకు భంగం కలగకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెచ్ఐవీని ముందుగా గుర్తించడం ద్వారా అవసరమైన వైద్య సేవలు, చికిత్సను సకాలంలో పొందే అవకాశం ఉంటుందనీ ,ప్రజలు అపోహలకు గురికాకుండా హెచ్ఐవీ పరీక్షలపై అవగాహన పెంచుకోవాలని, అవసరమైన వారు సమీపంలోని ఐసీటీసీ/హెచ్ఐవీ పరీక్షా కేంద్రాలను సంప్రదించాలని కోరారు. హెచ్ఐవీపై అవగాహన సకాలంలో పరీక్ష -- ఆరోగ్యకరమైన సమాజం" అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమం లో డి ఎం హెచ్ ఓ డాక్టర్ జ్ఞానేశ్వర్ ,డాక్టర్ హరి ప్రసాద్ , ఐసిటిసి కౌన్సిలర్ ధనశ్రీ , గోపి సుధాకర్, రవి పీఎంవో శంకర్ రాథోడ్, కాముని రాజేశ్వర్ , స్కోప్ ఎన్జీవో ఉప్పలయ్య. అనిల్ ,లింక్ వర్కర్ ప్రోగ్రాం మేనేజర్ లక్ష్మణ్ ,స్టాఫ్ నర్స్ సౌందర్య, అంజిరెడ్డి సిపిఎం శ్రీనివాస్ అకౌంటెంట్ రమేష్ పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీలలో అందుబాటులో లేని పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు.

గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని గ్రామ పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 1;00 గంట వరకు మాత్రమే విధులలో ఉంటున్నారని ఫిర్యాదులు వచ్చాయి. కావున విధి నిర్వహణ సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం గద్వాల మండలంలోని ఈడిగోని పల్లి గ్రామ పంచాయతీని, ధరూర్ మండలంలోని ఎల్మలోని పల్లి గ్రామ పంచాయతీలను మధ్యాహ్నం 2.00 గంటల సమయంలో ఆకస్మిక తనఖీ చేయడం జరిగినది. తనిఖీ సమయంలో పంచాయతీ కార్యదర్శులు కార్యాలయంలో అందుబాటులో లేనట్లు నిర్ధారించడం జరిగినది. ఈ విషయంపై గద్వాల మరియు ధరూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారులను ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శుల ముందస్తు అనుమతి తీసుకుని విధుల నుంచి వెళ్లారా అని వివరణ కోరగా, ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోకుండా విధులకు గైర్హాజరు అయినట్లు తెలియజేశారు. ప్రజలకు సేవలు అందించాల్సిన అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గ్రామపంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు ఆయన తెలియజేశారు.

## స్నేహితుడి కుటుంబానికి మిత్రుల చేయూత

**వీణవంక, ఆగస్టు 11 ( అక్షర కలం ):**



వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన దాసారపు వినోద్ కుమార్ (33) ఏప్రిల్ 12న గుండెపోటుతో మృతి చెందగా, ఆ కుటుంబానికి స్నేహితులు ఆసరాగా నిలిచారు. వినోద్ మరణించేనాటికి భార్య గర్భిణి కాగా, ఒక కుమార్తె ఉంది. దీంతో వినోద్ కుమార్‌తో చదువుకున్న పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ స్నేహితులు ఏకమై రూ.73,000 సేకరించి మంగళవారం కుటుంబ సభ్యులకు అందజేసి తమ గొప్ప మనసు చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో వినోద్ స్నేహితులు కుటుంబ సభ్యులు ఉన్నారు..

# వందే భారత్ అవార్డుకు జర్నలిస్టు డాక్టర్ బండి కుమార్ ఎంపిక..

-సంచలనాత్మక కథనాలకు కేరాఫ్..

-నాడు డాక్టరేట్,నంది అవార్డు.. నేడు వందే భారత్ అవార్డు..

-వెల్లువెత్తుతున్న అభినందనలు..

-ప్రస్తుతం పీపుల్స్ డైరీ ఖమ్మం ప్రతినిధిగా విధులు

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**



ఖమ్మం జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ బండి కుమార్ వందే భారత్ జాతీయ అవార్డుకి ఎంపికయ్యారు.. సీనియర్ జర్నలిస్టు డాక్టర్ బండి కుమార్ గత 13 సంవత్సరాలుగా వివిధ ఛానెల్స్, పత్రికల్లో, వివిధ హెదాల్లో జర్నలిస్ట్ గా పనిచేస్తున్నారు. అనేక అంశాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, అదేవిధంగా ప్రజా సమస్యలను వెలికి తీస్తూ ప్రభుత్వాల ద్వారా వాటిని పరిష్కరించేందుకు విశేషంగా కృషి చేస్తున్నారు. ఈ విధంగా సమాజానికి సేవచేస్తూ సీనియర్ జర్నలిస్ట్ గా పనిచేస్తున్నందుకు అతని సేవలను గుర్తించి ఈ నెల ఆగష్టు 15వ తేదీన శనివారం రోజున హైదరాబాద్ రవీంద్ర భారతి లోని పైడి జయరాజు ప్రివ్యూ థియేటర్ 2వ అంతస్థు లో జరిగే వందే భారత్ అవార్డు పురస్కారం కార్యక్రమంలో ప్రముఖ సినీ గీత రచయిత జాతీయ అవార్డు గ్రహీత సుద్దాల అశోక్ తేజ, ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు చేతుల మీదుగా ప్రధానం చేస్తున్నారు. సీనియర్ జర్నలిస్టు డాక్టర్ బండి కుమార్ "పీపుల్స్ డైరీ" దినపత్రిక ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అనేక సంచలనాత్మక కథనాలను అందించారు. ఎక్కడ అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నా ఎలాంటి శక్తుల ఒత్తిళ్లకు లొంగకుండా నిర్భయంగా వార్తలు అందించడంలో దిట్ట... జర్నలిజం వృత్తినే శ్వాసగా... నైతిక విలువలను పాటిస్తూ పేదల పక్షాన నిలువడం, అన్యాయాన్ని ఎదురించడం లక్షణం.. అక్రమార్కుల బెదిరింపులకు వెరువకుండా, అక్రమ కేసులకు సైతం భయపడకుండా ఎంచుకున్న దారిలో దూసుకెళ్తూ ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఎందరో జర్నలిస్టులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. వందే భారత్ జాతీయ అవార్డు రావడం పట్ల స్థానిక సీనియర్ జర్నలిస్టులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలుపుతూ సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ బండి కుమార్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నారు.

# ఇల్లందు 22వ వార్డులో మెగా హెల్త్ క్యాంప్.

**అక్షర కలం ఇల్లందు ప్రతినిధి:-**

వర్షాకాలంలో దోమల వల్ల వచ్చే వ్యాధులను నివారించేందుకు ఇల్లందు పట్టణం 22వ వార్డులో మంగళవారం మెగా హెల్త్ క్యాంపును నిర్వహించారు. స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన ఈ క్యాంపులో వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. క్యాంపుకు ముఖ్య అతిథిగా హాజరైన 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు.



ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూడాలని, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ గ్లాసులు, ఖాళీ బాటిళ్లలో కొద్దిగా నీరు కూడా నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని, వాటిని వెంటనే తొలగించాలని సూచించారు. అలాగే ఇంటి చుట్టూ ఉన్న గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, అవసరమైతే కిరోసిన్ వాడాలని పిలుపునిచ్చారు. క్యాంపులో జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులకు పరీక్షలు నిర్వహించి, షుగర్, బీపీ స్క్రీనింగ్ చేసి జ్వరం, యాంటీబయాటిక్స్, విటమిన్, బలం మందులను పంపిణీ చేశారు. వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, ఆహారపు అలవాట్లపై వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ క్యాంపులో ఏఎన్ఎం లు కే. లక్ష్మి, కే. కనకరత్న, హెల్త్ అసిస్టెంట్ బి. లాల్ సింగ్, ఆశ వర్కర్లు ఎస్. విజయ కుమారి, ఎ. సువాలి, స్థానిక యువకులు పాల్గొని సేవలందించారు.

## పాడైపోయినస్క్రాప్.మిషనరీమరియు స్క్రాప్ అమ్మకానికి కలదు ఉత్సాహవంతులైన వారు కొనుగోలు చేయగలరు. ఐటిడిఏప్రాజెక్టుఅధికారిబి.రాహుల్,


**అక్షర కలం / భద్రాచలం**

ఐటీడీఏ భద్రాచలం ఆధీనంలో విస్తా కాంప్లెక్స్.నందుగలఐటీడీఏషాపులలో షాపు నంబర్ 9 షాప్ నెంబర్ 30 లలో రంగురాళ్లకు సంబంధించిన పాడైపోయిన స్క్రాప్ మిషనరీ అమ్మకానికి కలదని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్, మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.శ్రీ సీతారామచంద్ర స్వామి వారిఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా పడమర మెట్ల వద్ద గల విస్తా కాంప్లెక్స్ లో గల ఐటీడీఏ భద్రాచలం వారి 13 షాపులు కలవని,అట్టి షాపులలో షాప్ నంబర్ 9మరియురంగురాళ్లకుసంబంధించిన పాడైపోయిన స్క్రాప్ మిషనరీ ఉన్నదని, సుమారుగా 2.50 టన్నులు మరియుషాప్.నంబర్30లోసుమారుగా 1.50టన్నులుపాడైపోయినస్క్రాప్ 4టన్నులుఅమ్మకానికికలదనిఆయన అన్నారు. కావునఉత్సాహవంతులు అట్టి స్క్రాప్ కోరుటకు ఈ నెల 14న సాయంత్రం నాలుగు గంటలకు విస్తా కాంప్లెక్స్ లో హాజరై కొనుగోలు చేయవలసిందిగాఆయనకోరారు.మరిన్ని విషయాలకు శ్రీ చలపతి944150 7135 ఫోన్ నెంబర్ ని సంప్రదించి తెలుసుకోగలరని ఆయన అన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

## ఆట





# వామప్ మ్యాచ్‌లో పోరాడుతోన్న భారత్

శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు సన్నాహకంగా జరుగుతున్న వామప్ మ్యాచ్‌లో భారత్ పోరాడుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 90 ఓవర్లలో 8 వికెట్లకు 357 పరుగులు చేసింది. దేవదత్ పడిక్కల్(164 బంతుల్లో 18 ఫోర్లతో 142 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగగా.. రవీంద్ర జడేజా(117 బంతుల్లో 7 ఫోర్లతో 63) హాఫ్ సెంచరీతో రాణించాడు. మానవ్ సుతార్(90 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 41), సరాన్ష్ జైన్(22), గుర్నూర్ బ్రార్(17 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 36 నాటౌట్) విలువైన పరుగులు చేశారు.శ్రీలంక ఎలెవన్ బౌలర్లలో రమేష్ మెండిస్, అసంక మనోజ్ రెండేసి వికెట్లు తీయగా.. విశ్వ ఫెర్నాండో, కేశర నువాంత తలో వికెట్ తీసారు. భారత్ ఇంకా శ్రీలంక కంటే 6 పరుగుల వెనుకంజలో ఉంది. రెండో రోజు ఆటలో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే బిగ్ షాక్ తగిలింది. విశ్వ ఫెర్నాండో వేసిన తొలి ఓవర్ రెండో బంతికే యశస్వి జైస్వాల్(0).. దిలుమ్ సుదీర్‌కు క్యాచ్ ఇచ్చి సిల్వర్ డక్‌గా వెనుదిరిగాడు. వైడ్‌బాల్‌ను వెంటాడి మరీ మూల్యం చెల్లించుకున్నాడు.

# లియోనల్ మెస్సీ హత్యకు కుట్ర..

ఇటీవల ముగిసిన ఫిఫా ప్రపంచకప్ 2026 సందర్భంగా అర్జెంటీనా స్టార్, ఫుట్‌బాల్ లెజెండ్ లియోనెల్ మెస్సీ హ్యతకు కుట్ర జరిగినట్లు తెలుస్తోంది. ఈ అర్జెంటీనా దిగ్గజాన్ని లక్ష్యంగా చేసుకొని టెర్రర్ అటాక్ ప్లాన్ చేసినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొనడం తీవ్ర చర్చనీయాంశమైంది. లియోనెల్ మెస్సీని హత్య చేయాలని ఉగ్రమూకలు ప్రయత్నించాయని స్పానిష్ న్యూస్ పేపర్ కథనం ప్రచురించింది. ఇందుకు సంబంధించిన పక్కా సమాచారం అమెరికా పోలీసుల వద్ద ఉందని పేర్కొంది. అయితే ఈ ప్రయత్నాలను అమెరికా ఎఫ్‌బీఐ, అంతర్జాతీయ పోలీస్ సహకార విభాగం నేతృత్వంలోని సెక్యూరిటీ నెట్‌వర్క్ సమర్థవంతంగా ఎదుర్కొన్నాయని ఆ కథనంలో తెలిపింది. ఆత్మహుతి దాడితో మెస్సిని చంపాలని ఉగ్రమూకలు ప్రయత్నించాయని వెల్లడించింది. మెస్సి హ్యతకు సంబంధించి ఓ దుండగుడు తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ పెట్టినట్లు కూడా ఆ కథనంలో పేర్కొన్నారు. 'నా శరీరానికి నాలుగు బాంబులు పెట్టుకొని మెస్సీని పేల్చేసేందుకు అట్లాంటా స్టేడియానికి వెళ్తున్నా'అని నిందితుడు పోస్ట్ పెట్టి తొలిగించినట్లు సమచారం. ఈ పోస్ట్‌తో అప్రమత్తమైన భద్రతా అధికారులు ఉన్నత స్థాయిలో సమీక్షించి కఠిన చర్యలు తీసుకున్నట్లు స్పానిష్ పత్రిక వెల్లడించింది. డాలస్ ఎయిర్ పోర్ట్‌కు వచ్చిన ఓ ఫోన్ కాల్‌ను కూడా అధికారులు పరిశీలించినట్లు తెలుస్తోంది. ఇంట్లో తయారు చేసిన బాంబులతోపాటు ఏఆర్-15 తుపాకీతో స్టేడియానికి వెళ్తున్నట్లు ఆ అనుమానితుడు పేర్కొన్నాడని ఆ కథనంలో రాసుకొచ్చారు. మెస్సితో పాటు ఇతర క్రీడాకారులు, పోలీస్ అధికారులను కూడా లక్ష్యంగా చేసుకున్నారని భద్రతా సిబ్బంది గుర్తించారు. లియోనెల్ మెస్సీతో పాటు క్రిస్టియానో రొనాల్డో కూడా వారి జాబితాలో ఉన్నట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి. పోర్చుగల్ ఫుట్‌బాల్ టీమ్ బస ఎక్కడని ఆరా తీసినట్లు కూడా పోలీసుల దృష్టికి వచ్చింది. దాంతో అప్పటి నుంచి భద్రతపరంగా అధికారులు అప్రమత్తంగా ఉన్నట్లు తెలుస్తోంది. చివరికి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఫిఫా ప్రపంచకప్ ప్రశాంతంగా ముగియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఫిఫా ప్రపంచకప్‌లో స్పెయిన్ విజేతగా నిలవగా.. అర్జెంటీనా రన్నరప్‌తో సరిపెట్టుకున్న సంగతి తెలిసిందే.








# టీమిండియాకు గాయాల బెడద


శ్రీలంక పర్యటనలో ఉన్న టీమిండియాను గాయాల బెడద వేధిస్తోంది. ఇప్పటికే జస్‌ప్రీత్ బుమ్రా, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా, నితీష్ కుమార్ రెడ్డి గాయాలతో ఈ పర్యటనకు దూరం కాగా.. జాగా ఈ జాబితాలో సాయి సుదర్శన్ చేరాడు. కాలి బొటన వేలి గాయంతో ఈ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. భారత్-ఏ తరఫున శ్రీలంక-ఏతో జరిగిన సిరీస్‌లో సాయి సుదర్శన్ కాలి వేలికి గాయమైంది. అయినా శ్రీలకంతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు సాయి సుదర్శన్‌ను ఎంపిక చేసిన సెలెక్టర్లు.. ఫిట్‌నెస్ నిరూపించుకుంటే సిరీస్‌లో కొనసాగుతాడని తెలిపారు. అయితే తాజాగా నిర్వహించిన వైద్య పరీక్షల్లో సాయి సుదర్శన్ గాయం తగ్గలేదని తేలింది. దాంతో అతను ఈ సిరీస్ మొత్తానికి దూరం కావాల్సి వచ్చింది. అయితే సాయి సుదర్శన్ దూరమవ్వడంపై బీసీసీఐ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఆ సమయంలోనే అతనికి రిప్లేస్‌మెంట్‌గా మరో ఆటగాడిని ఎంపిక చేయవచ్చు. సాయి సుదర్శన్ స్థానంలో తెలుగు తేజం షేక్ రషీద్‌ను ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన షేక్ రషీద్‌కు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మెరుగైన రికార్డ్ ఉంది. ముఖ్యంగా టాపార్డర్ బ్యాటర్‌గా అతని రికార్డ్స్ మెరుగ్గా ఉన్నాయి. ఇప్పటి వరకు 29 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన షేక్ రషీద్ 46.64 సగటుతో 1959 పరుగులు చేశాడు. ఇందులో 5 శతకాలతో పాటు 10 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇటీవల శ్రీలంక-ఏ జరిగిన అనధికారిక టెస్ట్ సిరీస్‌లోనూ షేక్ రషీద్ మెరుగైన ప్రదర్శన కనబర్చాడు. మూడు ఇన్నింగ్స్‌ల్లో 63, 20, 45 పరుగులతో రాణించాడు. అయితే షేక్ రషీద్‌కు సర్ఫరాజ్ ఖాన్‌తో పోటీ నెలకొంది. అయితే ఐపీఎల్ తర్వాత సర్ఫరాజ్ ఖాన్ ఎలాంటి ప్రొఫెషనల్ క్రికెట్ ఆడలేదు. సీనియర్లకు ప్రాధాన్యత ఇస్తే సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం లభిస్తుంది. సెలెక్టర్లు సర్ఫరాజ్ ఖాన్‌తో పాటు షేక్ రషీద్ పేర్లను సాయి సుదర్శన్‌కు రిప్లేస్‌మెంట్‌గా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. రుతురాజ్ గైక్వాడ్ కూడా రేసులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.

అక్షరకలం
తెలుగు దినపత్రిక



## సినిమా

CINEMA






# రామాయణ తొలుత విదేశాల్లో విడుదల

రామాయణం ఇతిహాసం ఆధారంగా తెరకెక్కుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ' ప్రపంచవ్యాప్త విడుదలపై నిర్మాత నమిత్ మల్హోత్రా కీలక ప్రకటన చేశారు. ఈ సినిమాను అంతర్జాతీయ మార్కెట్‌లో ముందుగా.. ఆ తర్వాత భారత్‌లో విడుదల చేసేలా వినూత్న వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు వెల్లడించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో ఆయన మాట్లాడారు. నవంబర్ 6న విదేశాల్లో 'రామాయణ' విడుదల చేస్తున్నాం. విదేశీ మార్కెట్లలో సినిమాల విడుదల సాధారణంగా శుక్రవారం నుంచే ప్రారంభమవుతుంది. ఇండియాలో మాత్రం దీపావళి నవంబర్ 8 రోజే విడుదల చేస్తాం అని చెప్పారు. దిగ్గజ దర్శకుడు నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ బడ్జెట్ దృశ్యకావ్యంలో శ్రీరాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా యష్, హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తున్నారు.

# 12న ఇరుముడి ట్రైలర్ విడుదలకు సన్నాహాలు

**మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి' ట్రైలర్‌ను ఆగస్టు 12న విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. 'నిన్ను కోరి', 'టక్ జగదీష్' వంటి చిత్రాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది.**

ఇప్పటివరకు సినిమాకు సంబంధించి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథాంశానికి భక్తి అంశాలను జోడించి సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తుండటంతో 'ఇరుముడి'పై అంచనాలు మరింత పెరిగాయి. ట్రైలర్ విడుదల కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది. ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తే సినిమా విడుదలకు ముందే హైప్ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రవితేజను శివ నిర్వాణ ఏ తరహా పాత్రలో చూపించారనే విషయం ట్రైలర్ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ కుమార్తె పాత్రలో బేబీ నక్షత్ర కనిపించనుంది. కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న కథలో ఈ తండ్రీకూతుళ్ల బంధం కీలకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మాస్ మహారాజా ఇమేజ్‌కు భిన్నంగా కుటుంబ భావోద్వేగాలను, భక్తి అంశాలను కలగలిపి శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దీంతో 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో విభిన్నమైన సినిమాగా నిలుస్తుందా అన్న ఆసక్తి నెలకొంది. కాగా 'ఇరుముడి' ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# మాల అమరవీరులకు ఘన నివాళి

## -- ఎస్సీ వర్గీకరణపై 'మాల మహానాడు' నిప్పులు



అక్షరకలం నల్గొండ

మాలల భావితరాల భవిష్యత్తు కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడి అమరులైన పీవీ రావు, పానంగి శేషయ్య, గోపతోటి నారాయణల త్యాగాలు చిరస్మరణీయమని మాల మహానాడు నల్గొండ జిల్లా అధ్యక్షుడు లకుమాల మధుబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నమల్ల సత్యం అన్నారు. ?మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్య ఆదేశాల మేరకు, రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హాలియా మండల కేంద్రంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాల అమరవీరుల సంతాప సభ నిర్వహించారు. లకుమాల మధుబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ముందుగా అంబేద్కర్ విగ్రహానికి, అనంతరం అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ.. 1997 ఆగస్టు 11న అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దళితుల రాజ్యాంగ హక్కుల సాధనకై చేపట్టిన సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమంలో వేలాది మంది మాలలపై గుర్రాలతో తొక్కించి, వారి ప్రాణాలు పోవడానికి కారణమయ్యారని ఆరోపించారు. ?నేడు ఆయన శిష్యుడైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాలల ఓట్లతో అధికారంలోకి వచ్చి, ఇప్పుడు మాలలకు తడిగుడ్డతో గొంతు కోస్తున్నారని మండిపడ్డారు. వర్గీకరణ పేరుతో మాలలకు కేవలం 5 శాతం రిజర్వేషన్లు కేటాయించి, రోస్టర్ పాయింట్లలో తీవ్ర అన్యాయం చేస్తూ మాల విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చారని విమర్శించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి మాలల సత్తా ఏంటో చూపిస్తామని, మాల మహానాడు ఆధ్వర్యంలో ప్రణాళికాబద్ధంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి జంగాల భిక్షం, గండమాల జానయ్య, మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు చింతమల్ల పాండురంగయ్య, నాగార్జునసాగర్ నియోజకవర్గ అధ్యక్షుడు లకుమాల లింగయ్య, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ రువ్వ వెంకటేశ్వర్లు, నిడమనూరు మండల ప్రధాన కార్యదర్శి మందారి రామాంజనేయులు, నాయకులు మోటమర్రి వెంకటేశ్వర్లు, మండల ముత్యాలు, నీరుడు ఇంద్రయ్య, గోగు యాదగిరి, బుల్లెద్దు మల్లేష్, పెరుమాళ్ళ బద్రి తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు క్రీడా పోటీలు



అక్షర కలం : చిట్యాల

చిట్యాల పట్టణంలోని పీఎం శ్రీ జెడ్ పి హెచ్ ఎస్ చిట్యాలలో ఉన్న భవిత కేంద్రంలో పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి పి. సైదానాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. సుశీల ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సైదానాయక్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. గెలుపోటముల కంటే పోటీల్లో పాల్గొనడమే ముఖ్యమని విద్యార్థులను ప్రోత్సహించారు. చిట్యాల మండల పరిధిలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగ విద్యార్థులకు వారి సామర్థ్యాలకు అనుగుణంగా రన్నింగ్, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, బాల్ త్రో, రింగ్ త్రో తదితర పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసాపత్రాలు, లంచ్ బాక్సులు, మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, భవిత ఉపాధ్యాయులు ఐఈఆర్పీ ఏ. గీత, స్పెషల్ ఎడ్యుకేటర్స్ ఎం. సౌమ్య , ఏ. చైతన్య , ఫిజియోథెరపిస్ట్ శృతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# పంతంగి గ్రామాన్ని సందర్శించిన జెడ్పి సిఈఓ శోభారాణి





అక్షర కలం,చౌటుప్పల్:

చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామాన్ని సందర్శించిన జడ్పీసీఈవో శోభారాణి గ్రామంలో హైస్కూలు సందర్శించి విద్యార్థినీ విద్యార్థులకు స్కూల్ డ్రెస్ పంపిణీ చేశారు.అదేవిధంగా స్కూల్లో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటి,గ్రామంలో పూర్తయిన ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి పెండింగ్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల గురించి సంబంధిత ఏఈ ని అడిగి తెలుసుకన్నారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మండల ఎంపీడీవో శ్రీలత,గ్రామ సర్పంచ్ శ్రీలత సుందర్,పంచాయతీ కార్యదర్శి పద్మజ,హౌసింగ్ ఏఈ పవన్ కళ్యాణ్,స్కూల్ హెడ్మాస్టర్ సత్యనారాయణ,విద్యార్థిని విద్యార్థులు,తదితరులు,పాల్గొన్నారు.

# ధర్వేశిపురం బోనాల కరపత్రావిష్కరణ

అక్షర కలం : చిట్యాల

శ్రావణ మాసం సందర్భంగా నల్లగొండ జిల్లా ధర్వేశిపురం సదాశివ ఫంక్షన్ హాల్లో శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లికి కుమ్మరుల ఆధ్వర్యంలో ఈ నెల 16న 201 బోనాలు సమర్పించనున్నట్లు కుమ్మర సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం చిట్యాలలో మండల అధ్యక్షుడు పాకాల దినేష్, మరియు సభ్యుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ?ఈ బోనాల జాతర మహోత్సవానికి సుమారు 3,000 మందికి పైగా కుమ్మరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మానవ నాగరికతకు కుమ్మరి తొలి మెట్టు అని, కుండ ప్రతీ ఒక్కరి ఆయువు పట్టు అని నాయకులు పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ నిమ్మనగోటి శ్రీను, బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ ఎగిరిశెట్టి అనిత, జిల్లా కమిటీ సభ్యులు తాడూరి చంద్రం, చిట్యాల మండల ప్రధాన కార్యదర్శి ఆర్రూరి నరసింహ, ఉపాధ్యక్షులు ఆర్రూరి శ్రీను, ఏరుకొండ నర్సింహ, పాకాల వెంకన్న, పాకాల సత్యనారాయణ, సిరిసినవాడ వెంకన్న, ఖమ్మంపాటి నర్సింహ, బొడ్డుపల్లి శ్రీను, బొడ్డుపల్లి ఉపేందర్, ఖమ్మంపాటి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# కాలుష్య కోరల్లో ఆరగుడం.. ఊపిరి పీల్చుకోవాలన్నా భయమే !

అక్షర కలం : చిట్యాల

చిట్యాల మండలం ఆరగుడం గ్రామంలో రసాయన పరిశ్రమ నుంచి వెలువడుతున్న దుర్వాసన, కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో దుర్వాసన తీవ్రంగా ఉంటోందని, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు.పరిశ్రమ వ్యర్థాల వల్ల భూములు, పంట పొలాలు కలుషితమవుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రభావం మౌర్సుగూడెం, పెద్దకాపర్తి, పిట్టంపల్లి, వెలిమినేడు తదితర గ్రామాలపై కూడా ఉందని పేర్కొన్నారు. కాలుష్య ప్రభావంతో ఆరగుడం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 160 నుంచి 30కి తగ్గిందని ఉపాధ్యాయులు తెలిపారు. దుర్వాసన కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆగస్టు 8న విద్యార్థులు, గ్రామస్తులు ర్యాలీ నిర్వహించి కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారుపరిశ్రమపై 2024లోనే అధికారులకు ఫిర్యాదులు చేసినా శాశ్వత పరిష్కారం లభించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పరిశ్రమ నుంచి వెలువడుతున్న గాలి, నీరు, నేల కాలుష్యంపై శాస్త్రీయ పరీక్షలు నిర్వహించి, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నట్లు తేలితే పరిశ్రమను జనావాసాలకు దూరంగా తరలించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



కంపెనీ పక్కన మాకు నిమ్మ తోట ఉంది నిమ్మ తోటలో పనిచేయాలంటే దినదిన ఘనంగా మారుతుంది. కంపెనీ నుండి విడుదల అయ్యే కలుషిత వాయువుల ద్వారా తోటలో పనిచేసుకోవడానికి ఇబ్బందికరంగా మారింది. కూలీలు రావాలన్నా భయపడే పరిస్థితి నెలకొంది. వెంటనే ఈ కంపెనీ పై చర్యలు తీసుకొని రైతులని కాపాడవలసినంగా కోరుకుంటున్నాను..

జంతు బుచ్చయ్య
ఆరెగూడెం గ్రామానికి చెందిన రైతు



డిఎన్ఎస్ కంపెనీ ద్వారా మా గ్రామంలో కలుషితం ఎక్కువగా అవుతుంది. సాయంత్రం ఇంటికి వచ్చిన అన్నం తినాలి అంటే ఆ దుర్వాసనకు వాంతులు వస్తున్నాయి ఇటువంటి పరిస్థితుల్లో గ్రామస్తులు అనారోగ్యం పాలవుతున్నారు తక్షణమే ఈ కంపెనీని వేరే చోటికి తరలించాలని ప్రభుత్వాన్ని, అధికారులను కోరుతున్నాను

ఆరూరి రవికుమార్
ఆరెగూడెం గ్రామస్తులు

# హర్ ఘర్ తిరంగాను విజయవంతం చేయాలి

బీజేపీ రాష్ట్ర నాయకులు పోతేపాక సాంబయ్య

అక్షరకలం దేవరకొండ,



హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని మండలంలోని ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటిపైనా విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మండల ఇన్చార్జి పోతేపాక సాంబయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కొండమల్లేపల్లి మండలం పెండ్లి పాకాల గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు భూతరాజు భరత్ అధ్యక్షతన నిర్వహించిన పదాధికారుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి, జాతీయ సమైక్యతను పెంపొందించాలని కోరారు. మండలంలోని ప్రధాన ప్రజా సమస్యలు, రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, రైతుల ఇబ్బందులపై సమగ్రంగా చర్చించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతులు, యువత, మహిళలు, నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూనే, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై గ్రామస్థాయి నుంచి ప్రజా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు సున్నప్రోలు పద్మావతి, మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు యాదయ్య, యువమోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ నెల్లికంటి గోపి, ఉపాధ్యక్షులు లింగస్వామి, వశ్యానాయక్, కార్యదర్శులు విజయ్, తారయ్య, నాయకులు వెంకటేష్, లక్ష్మణ్, బాబూజీ, ఆనంద్, గణేష్, చందు, ఉదయ్ పాల్గొన్నారు.

# రమావత్ బిచ్య నాయక్ మృతి బాధాకరం

అక్షరకలం దేవరకొండ

దేవరకొండ మండలం పెద్ద తండాకు చెందిన రమావత్ బిచ్య నాయక్ మృతి బాధాకరమని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. మంగళవారం పెద్ద తండాలో బిచ్య నాయక్ మృతదేహానికి రమావత్ రవీంద్ర కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.....బిచ్య నాయక్ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రామావత్ నర్సింహ, శేరిపల్లి సర్పంచ్ వడత్య పద్మబలరాం తదితరులు పాల్గొన్నారు.



# మూఢనమ్మకాలను పెంచేలా వర్ణ యాగం నిర్వహించడం విడ్డూరం



అక్షర కలం : చిట్యాల

రాకెట్, హైటెక్ యుగంలో శాస్త్ర, సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందుతున్న సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్ణ యాగం చేయడం విడ్డూరంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. చిట్యాల మండల కేంద్రంలోని మేకల లింగయ్య స్మారక భవనంలో మంగళవారం నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సకాలంలో వర్షాలు కురవకపోతే సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం.. మూఢనమ్మకాలను ప్రోత్సహించే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇలాంటి చర్యలను నివారించాల్సిన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, పోలీసులు సైతం కార్యక్రమంలో భాగస్వాములు కావడం ఆశ్చర్యం కలిగిస్తోందని అన్నారు. ప్రజల సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాలువల రెండో దశ పనులకు నిధులు మంజూరైనప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్లు పనులు ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. పనులను సకాలంలో పూర్తి చేయకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సీపీఎం మండల కమిటీ అధ్యక్షుడు అరూరి శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, మండల నాయకులు బొబ్బిలి సుధాకర్ రెడ్డి, నెలికంటి నర్సింహా, పంది నరేష్, కల్లూరి కుమారస్వామి, మెట్టు నర్సింహా, గుడిసె లక్ష్మీనారాయణ, కందగట్ల గణేష్, జిట్ట స్వామి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## లిటిల్ స్టార్స్ స్కూల్ లో వైభవంగా ఆషాడం బోనాల ఉత్సవాలు

సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం....



కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామ సమీపంలో గల లిటిల్ స్టార్స్ స్కూల్ లో మంగళవారం ఆషాడం బోనాల ఉత్సవం ఘనంగా నిర్వహించారు.డప్పు చప్పుల్ల మధ్య పోతురాజుల ఆటపాటలతో స్కూల్ ప్రాంగణం మర్మోగిపోయింది.స్కూల్ చైర్మన్ గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని అన్నారు.ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రతి ఒక్కరిని అమ్మవారు చల్లగా చూడాలని ఈ ఉత్సవం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ టీచర్లు పాల్గొని సందడి చేశారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# క్రీడా ప్రతిభతో పాటు విద్యలోనూ విద్యార్థులు రాణించేలా తీర్చిదిద్దాలి. ---- జిల్లా కలెక్టర్ అంకిత్.

అక్షర కలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి :-

పాఠశాలల్లో నాణ్యమైన పౌష్టికాహారం, పల్లె దవాఖానలో మెరుగైన వైద్య సేవలు అందించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. పాల్వంచ మండలం కిన్నెరసాని గ్రామం, యానం బైలు, రాజాపురం ప్రాంతాల్లోని పాఠశాలలు, పల్లె దవాఖాన, అంగన్వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిన్నెరసాని గిరిజన సంక్షేమ ఆదర్శ క్రీడా పాఠశాల, యానం బైలు జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల, యానం బైలు పల్లె దవాఖాన, రాజాపురం అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులు, చిన్నారులు, గ్రామీణ ప్రజలకు అందుతున్న విద్య, క్రీడా శిక్షణ, వసతి, భోజనం, వైద్య సేవలు, పౌష్టికాహారం, పారిశుద్ధ్యం తదితర సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు క్షేత్రస్థాయిలో సేవల అమలును స్వయంగా పరిశీలించారు. కిన్నెరసాని గ్రామంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆదర్శ క్రీడా



పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాల, లైబ్రరీ, క్రీడా ప్రదేశాలు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భవనాల పరిస్థితి, ఎక్కడైనా లీకేజీలు ఉన్నాయా, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారికి వసతి గృహంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా, అందుతున్న సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా లేవా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లో విద్యార్థులతో స్నేహపూర్వకంగా మాట్లాడిన కలెక్టర్ వారి విద్యా ప్రగతిపై ఆరా తీశారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫార్ములు, ఇతర విద్యా సామగ్రి అందాయా, తరగతులు సక్రమంగా జరుగుతున్నాయా, ఉపాధ్యాయులు బోధనపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల వంటశాలను పరిశీలించి విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహారాన్ని స్వయంగా పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యత, తయారీ విధానం, వంటశాల పరిశుభ్రత, మెనూ అమలు తదితర అంశాలను పరిశీలించి విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన, పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు.

# అర్హులైన వారికి చేయూత పెన్షన్లు దరఖాస్తుల స్వీకరణ పారదర్శకంగా జరగాలి....

- స్వీకరించిన దరఖాస్తుల డేటా ఎంట్రీ అధికారుల సమన్వయంతో పటిష్ట పర్యవేక్షణతో ముందుకు పోవాలి....
- చేయూత పెన్షన్ల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు....
- జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్.....

మెదక్, ఆగస్టు 11(అక్షర కలం):

ప్రభుత్వం నూతనంగా అందించే 7 రకాల చేయూత పెన్షన్ల కు అర్హులైన వారి దరఖాస్తుల స్వీకరించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని మినీ సమావేశ మందిరం నుంచి జిల్లా అధికారులు, ఏం పి డి ఓ లు, మండల స్పెషల్ అధికారులతో గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 15 నుంచి నూతనంగా ఇచ్చే చేయూత పెన్షన్ల కోసం దరఖాస్తులను




పరిశీలించి, అర్హులైన వారిని గుర్తించాలని, ప్రజా ప్రతినిధుల నుంచి, ప్రజావాణి కార్యక్రమంలో పెన్షన్ల కోసం వచ్చిన దరఖాస్తులను తక్షణమే ఎంట్రీచేయాలన్నారు. చేయూత పెన్షన్ల దరఖాస్తుల కోసం హెల్ప్ డెస్క్ నెంబర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏం పి డి ఓ కార్యాలయం, మున్సిపల్ ఆఫీస్ వద్ద చేయూత పెన్షన్ల కోసం ప్రజలకు అవగాహన కల్పించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. వృద్ధాప్య పింఛన్లు మరియు బీడీ కార్మికుల పెన్షన్లుమినహాయించి మిగతా పెన్షన్ల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. వృద్ధాప్య , బీడీ కార్మికుల పింఛన్లపై ప్రభుత్వం అనుమతించిన తర్వాత వాటినిపరిష్కరించాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో చేయూత పెన్షన్ల దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా అధికారులు తాహసిల్దార్లు,ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, ఏపీవోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తేనెటీగల పెంపకంతో రైతులకు అదనపు ఆదాయం

## జిల్లా వ్యవసాయ అధికారి వెంకటరామిరెడ్డి

అక్షర కలం, చౌటుప్పల్

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం మహ్మదాబాద్ గ్రామంలో రైతు మల్లేపల్లి ప్రముఖ్ రెడ్డి నిర్వహిస్తున్న వ్యవసాయ క్షేత్రంలో చేపడుతున్న తేనెటీగల పెంపకం ను జిల్లా వ్యవసాయ అధికారి వెంకటరామిరెడ్డి సందర్శించారు.తెలంగాణ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రైతు నేస్తం' కార్యక్రమంలో భాగంగా ఈ పర్యటన చేపట్టారు.ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రంలో తేనెటీగల పెంపకం,వాటి సంరక్షణ, తేనె సేకరణ విధానం తదితర అంశాలను అధికారులు పరిశీలించారు.వ్యవసాయంతో పాటు తేనెటీగల పెంపకాన్ని అనుబంధ ఉపాధి మార్గంగా చేపట్టడం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటరామిరెడ్డి తెలిపారు.తక్కువ స్థలంలోనే తేనెటీగల పెంపకాన్ని నిర్వహించడంతో పాటు పంటల పరాగసంపర్కానికి ఇవి ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో మిత్ర ఫౌండేషన్ చైర్మన్ నిమ్మల రామచంద్రయ్య పాల్గొని తేనెటీగల




పెంపకం ద్వారా ఉత్పత్తి చేసే స్వచ్ఛమైన తేనె వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు, ప్రజలకు వివరించారు.సహజ పద్ధతుల్లో సేకరించే స్వచ్ఛమైన తేనెకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని,నాణ్యతతో కూడిన తేనెను ఉత్పత్తి చేసి నేరుగా వినియోగదారులకు అందించడం ద్వారా రైతులు మెరుగైన ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. తేనెటీగల పెంపకాన్ని వ్యవసాయానికి అనుబంధంగా అభివృద్ధి చేసుకుంటే రైతులకు ఏడాది పొడవునా అదనపు ఆదాయ మార్గం ఏర్పడుతుందని ఆయన అన్నారు.అంతేకాకుండా తేనెటీగల ద్వారా పంటల పరాగసంపర్కం పెరగడం వల్ల పంట దిగుబడులు కూడా మెరుగుపడే అవకాశం ఉందని వివరించారు.రైతులు సంప్రదాయ వ్యవసాయంతో పాటు ఆధునిక,అనుబంధ వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించాలని సూచించారు.రైతులు తేనెటీగల పెంపకం, తేనె సేకరణ,శుద్ధి,ప్యాకేజింగ్,మార్కెటింగ్ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ ఆదాయాన్ని పెంచుకునేందుకు రైతులు ముందుకు రావాలని అధికారులు,నిర్వాహకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.పూజ,ఏఇవో కె.రాజేష్, రైతులు మాధవరెడ్డి,మల్లేపల్లి ప్రముఖ రెడ్డి,అంజిరెడ్డి,ఏపూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

వీణవంక, ఆగస్టు 11 ( అక్షర కలం ):

కరీంనగర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజగోపాల్ రావు మంగళవారం వీణవంక, చల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. హాజరు, ఓపి, ఎన్ సి డి రిజిస్టర్లు, ఫార్మసీ స్టోర్స్ మరియు వ్యాక్సిన్ల నిల్వ టెంపరేచర్ రికార్డులను పరిశీలించారు. ?గ్రామ స్థాయిలో సిబ్బంది సమన్వయంతో ఫీవర్ సర్వే, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటించాలని సూచించారు. టి-హబ్ కు ఫీవర్ శ్యాంపిల్స్ పంపాలని, పాము కాటు, కుక్క కాటు మందులు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. గర్భవతుల చెకప్స్, అభా కార్డుల సంఖ్య పెంచడంతో పాటు 14 ఏళ్లు నిండిన బాలికలకు హెచ్ పి వి వ్యాక్సినేషన్ వేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సంతోష్



కుమార్, డాక్టర్ వరుణ, డా. బీయా బానీ, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి, బాధితులకు అండగా నిలవాలి

-రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి
-మంత్లీ క్రైమ్ రివ్యూ మీటింగ్ లో అధికారులకు పలు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

అక్షర కలం, అందోలు:

సంగారెడ్డి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ మంత్లీ క్రైమ్ రివ్యూ సమావేశంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ దర్యాప్తులో నాణ్యత, పెండింగ్ కేసుల పరిష్కారం, ఎన్‌బీడబ్ల్యూ ఎగ్జిక్యూషన్, రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజా భద్రత, కమ్యూనిటీ పోలీసింగ్, అవగాహన కార్యక్రమాలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా వివిధ పోలీస్ స్టేషన్లలో దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్-గ్రేవ్, మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యూ కేసుల పురోగతిని సమీక్షించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లాంగ్ పెండింగ్ కేసులు, మిస్సింగ్ కేసుల ఛేదన, ఎన్‌బీడబ్ల్యూ ఎగ్జిక్యూషన్‌కు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని, నిర్ణీత గడువులోగా దర్యాప్తును పూర్తి చేయాలని ఆయన సూచించారు. గ్రేవ్ కేసుల్లో శాస్త్రీయ ఆధారాలను సేకరించి, నిందితులకు న్యాయస్థానంలో శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేపట్టాలన్నారు. నిజమైన




దోషులకు న్యాయస్థానంలో శిక్ష పడినప్పుడే ప్రజల్లో పోలీసులపై నమ్మకం మరింత పెరుగుతుందని అన్నారు. దర్యాప్తులో సాంకేతిక లేదా న్యాయపరమైన సందేహాలు ఉన్నప్పుడు ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలో మహిళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఏర్పాటు చేసిన షీ టీమ్స్ నిరంతరం పనిచేస్తూ, మహిళలపై జరుగుతున్న వేధింపులను అరికట్టడంతో పాటు మహిళా చట్టాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అధికంగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను హాట్‌స్పాట్లుగా గుర్తించి, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయించాలని అధికారులకు ఎస్పీ సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో గ్రామ స్థాయిలో సమాచార సేకరణ అత్యంత కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. విలేజ్ పోలీస్ అధికారులు గ్రామ ప్రజలు, యువతతో సత్సంబంధాలు కలిగి, ముందస్తు సమాచారాన్ని సేకరించాలని చెప్పారు. ఆయా గ్రామాల్లో రౌడీషీటర్లు, కేడీలు, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. నేర దర్యాప్తులో కీలకంగా ఉపయోగపడే సీసీ కెమెరాల ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, ప్రతి గ్రామంలోని ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లతో పాటు ప్రార్థనా స్థలాలు, పరిశ్రమలు, ధాబాలు, పెట్రోల్ బంకులు తదితర కీలక ప్రాంతాల్లో కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని ఎస్‌హెచ్‌ఓలకు సూచించారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని ఈ సందర్భంగా నగదు రివార్డులు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. అలాగే పోలీస్ స్టేషన్ల స్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులకు, సిబ్బందికి రివార్డులు, ప్రశంసాపత్రాల కోసం సిఫారసు చేయాలని ఎస్‌హెచ్‌ఓలకు సూచించారు. అనంతరం అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్. ఎస్‌హెచ్‌ఓలకు కేటాయించిన పోలీసు వాహనాల స్థితిగతులను పరిశీలించారు. ప్రతి వాహనానికి క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయించి, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వినియోగానికి సిద్ధంగా ఉంచాలని డ్రైవర్లను ఆదేశించారు. వాహనాల్లో అవసరమైన ఎమర్జెన్సీ కిట్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. వాహనాలను పరిశుభ్రంగా, మంచి స్థితిలో నిర్వహిస్తున్న డ్రైవర్లను ప్రత్యేకంగా అభినందించి, వారికి రివార్డులు ప్రకటించారు. ఈ నెలవారీ నేర సమీక్షా సమావేశంలో డీఎస్పీలు సత్యయ్య గౌడ్, వెంకట్ రెడ్డి, సైదా నాయక్, ప్రభాకర్, సురేందర్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, జిల్లా ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు సురేష్, రాజశేఖర్ రెడ్డి, సబ్‌ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమమే మా ప్రధాన ఎజెండా

-టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి

అక్షర కలం, అఃదోలు:

జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అన్నారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే--ఐజేయూ) సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గ సర్వసభ్య సమావేశం మంగళవారం రామచంద్రాపూర్‌లోని లక్ష్మీ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, యూనియన్ బలోపేతం, సంక్షేమ కార్యక్రమాలపై నాయకులు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమమే యూనియన్ ప్రధాన ఎజెండా అని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం



కృషి చేస్తామని తెలిపారు. యూనియన్ బలోపేతానికి ప్రతి సభ్యుడు భాగస్వామి కావాలని, జర్నలిస్టుల సమస్యలపై సమష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న జర్నలిస్టులు అనేక సమస్యల మధ్య విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని, వారి కుటుంబాలకు ఉపయోగపడే విధంగా ఆరోగ్య కార్డులు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అర్హత ఉన్నప్పటికీ ఇంకా అక్రిడిటేషన్ కార్డులు అందని జర్నలిస్టులు ఉన్నారని, వారందరికీ నిబంధనల మేరకు కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. చిన్న, మధ్య తరహా పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, ఫోటో జర్నలిస్టులు సహా అన్ని విభాగాల్లో పనిచేస్తున్న పాత్రికేయుల సమస్యలను సమానంగా పరిగణించాలని అభిప్రాయపడ్డారు. జర్నలిస్టుల మధ్య ఐక్యత ఉంటేనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. యూనియన్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రతి జర్నలిస్టుకు అండగా నిలిచేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం విషయంలో సంఘటితంగా ముందుకు సాగాలని యాదగిరి పిలుపునిచ్చారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. ఫైసల్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు యూనియన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, ఆరోగ్య కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టులు ఐక్యంగా ఉంటేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ నాయకులు, కార్యవర్గ సభ్యులు మాట్లాడి తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్, చిన్న, మధ్య తరహా పత్రికల సంఘం, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్, ప్రెస్‌క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

# జోగిపేటలో వైభవంగా బోనాల సంబురాలు





అక్షర కలం, ఆందోలు:

ఆషాడమాస బోనాల ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా అందోలు నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట పట్టణంలో మంగళవారం ఘనంగా బోనాల సంబురాలు జరుపుకున్నారు. పెద్ద ఎత్తున మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ దేవాలయంలోని పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిభంబించేలా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు, ఇందిరా నగర్ కాలనీ వాసులు శివశత్తుల ఆటలు, పోతరాజుల విన్యాసాలు, యువకుల నృత్యాల మధ్య బోనాల ఊరేగింపులు పురవీధుల గుండా పోచమ్మ దేవాలయం వరకు కొనసాగాయి. అక్కడ అమ్మవారికి బోనాలను సమర్పించిన ప్రజా ప్రతినిధులు, విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు, మహిళలు పోచమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు అందర్నీ చల్లంగా చూడాలని, కాపాడాలని అమ్మవారిని వేడుకున్నారు.

# చేయూత సామాజిక భద్రత పింఛన్ల కొరకు దరఖాస్తుల స్వీకరణ....

**– దరఖాస్తులు సమర్పణ చివరి తేదీ 31.08.2026....**

**– జిల్లా కలెక్టర్‌ప్రతిమాసింగ్....**

**మెదక్, ఆగస్టు11(అక్షర కలం):**

చేయూత సామాజిక భద్రత పింఛన్ల కొరకు అర్హులైన అభ్యర్థులు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం / మున్సిపల్ కార్యాలయం లలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణలో చేయూత సామాజిక భద్రత పింఛన్ల కొత్త దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని చెప్పారు.

ఈ ప్రక్రియకు చివరి తేదీ 31.08.2026, అర్హులైన నిరుపేదల నుండి దరఖాస్తులు స్వీకరించబడతాయని కలెక్టర్ వివరించారు. దరఖాస్తు చేయాల్సిన విధానం గురించి వివరిస్తూ అధికారిక వెబ్‌సైట్ చేయూత పోర్టల్ నుండి కానీ,గ్రామ పంచాయతీ/మున్సిపల్ కాయలయం నుండి కానీ దరఖాస్తు ఫారమ్‌ను పొందవచ్చు.గ్రామీణ ప్రాంతాల వారు పూరించిన దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యదర్శికి లేదా ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని, పట్టణ ప్రాంతాల వారు వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు లేదా మున్సిపల్ కమిషనర్లకు సమర్పించాలన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్నవారు ఆ దరఖాస్తులు గ్రామ పంచాయితీ కార్యదర్శి వద్దగాని,యంపీడిఓ కార్యాలయంలో గాని,మున్సిపల్ కార్యాలయంలో గాని ఉన్నాయా,ఆ దరకాస్తూ తో పాటు సరైన ధ్రువీకరణ పత్రాలు జత పరిచారా అని దరకాస్తుదారులు సరిచుసుకోవాలి అని సూచించారు. ప్రాధాన్య కేటగిరీలు అర్హతలు గురించి వివరిస్తూ ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యా0గులు,గీత, చేనేత కార్మికులు, ఫైలేరియా, డెయాలసిస్ బాధితులు, థలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా వ్యాధిగ్రస్తులు.



అర్హులన్నారు. ఆదాయపరిమితి గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ. 1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షల లోపు ఉండాలని తెలిపారు. అవసరమైన ధృవీకరణ పత్రాల జారీకి సౌకర్యం కల్పించడం: పింఛన్ల మంజూరుకు అవసరమైన అన్ని ధృవీకరణ పత్రాలు/పత్రాలు, వర్తించే విధంగా, సంబంధిత శాఖలు/అధికారుల ద్వారా సమకూర్చి జారీ చేయబడేలా చర్యలు తీసుకోవాలని వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. వితంతువుల విషయంలో భర్త మరణ ధృవీకరణ పత్రం, ఒంటరి మహిళల విషయంలో వేర్పాటు/ తసీల్దార్ స్థానిక విచారణ నివేదిక,దివ్యాశీగులకు యు డి ఐ డి ధ్రువీకరణ పత్రం, కల్లు గీత కార్మికుల విషయంలో నిషేధ ఒ ఎక్సైజ్ శాఖ నుండి ధృవీకరణ పత్రం, నేత కార్మికుల విషయంలో చేనేత ఒ వస్త్ర పరిశ్రమ శాఖ నుండి ధృవీకరణ పత్రం, మరియు ఫైలేరియా రోగుల విషయంలో వైద్య ఆరోగ్య శాఖ నుండి ఫైలేరియాసిస్ ధృవీకరణ పత్రం. తప్పనిసరి అన్నారు. స్వయం సహాయక బృందాల సమాఖ్యల పాత్ర గురించి వివరిస్తూ స్వయం సహాయక బృందాల సమాఖ్యలకు విస్తృతమైన పరిధి ఉన్నందున, చెయూత పింఛను కోసం దరఖాస్తు చేసుకోవడానికి మరియు అవసరమైన ధృవపత్రాలను పొందడానికి అర్హులైన ప్రతి వితంతువుకు మరియు ఒంటరి మహిళకు సహాయం అందించే బాధ్యతను వారికి అప్పగించారని చెప్పారు..ఆన్‌లైన్ డేటా ఎంట్రీ స్క్రీన్‌లను అభివృద్ధి చేసి, అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు ప్రతి మండలానికి 3 చొప్పున, ప్రతి పురపాలక సంఘానికి 5 చొప్పున మరియు ప్రతి పురపాలక సంఘానికి 10 చొప్పున డేటా ఎంట్రీ లాగిన్ ఐడీలను సృష్టించడం జరిగిందని,డేటా ఎంట్రీ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అసంపూర్ణమైన / తప్పు డేటాను నమోదు చేయకూడదు. అని వివరించారు.అనర్హుల గురించి వివరిస్తూ మూడు ఎకరాలకు (మించి)మాగాణి లేదా 7.5 ఎకరాలకు (మించి) మెట్ట భూమి ఉన్నవారు, నాలుగు చక్రాల వాహనాలు కలిగినవారు మరియు ప్రభుత్వ/ప్రైవేట్ ఉద్యోగులు అనర్హులు. అని చెప్పారు. వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, సికిల్ సెల్, తలసేమియా, హేమోఫోలియా, బోదకాలు, డయాలసిస్, చేనేత కార్మికులు పింఛన్ కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు తో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా పుస్తకం, యు డి ఐ డి / సదరం ధ్రువీకరణ పత్రం జత చేయాలని, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## చేయూత పింఛన్లకు 'గోల్డెన్ ఛాన్స్'.. అర్హులెవరూ మిస్ కావొద్దు.. కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, ఆగస్టు 11 (అక్షర కలం):**

కొత్తగా చేయూత పింఛన్లకు అర్హత పొందే పేదలను వారం రోజుల్లో గుర్తించి, అర్హులందరితో దరఖాస్తులు చేయించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ఆగస్టు 31 వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగనున్న నేపథ్యంలో గ్రామం, వార్డు వారీగా ఇంటింటి సర్వే నిర్వహించి ఒక్క అర్హుడు కూడా మిస్ కాకుండా చూడాలని సూచించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత, చేనేత కార్మికులు, ఫైలేరియా, తలసేమియా, సికిల్‌సెల్, హీమోఫీలియా బాధితులకు తొలి దశలో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన వారు అవసరమైన ధ్రువపత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీలు, స్వయం సహాయక సంఘాల సభ్యుల సహకారంతో, పట్టణాల్లో ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీఆర్‌డీవో గీత, మెప్మా పీడీ స్వరూపారాణి, డీపీవో జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ఉద్యోగాలకు ఉచిత కోచింగ్ ఏర్పాటు చేయాలి




**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11:**

పోలీస్ శాఖలో ఉద్యోగాల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటీలో నిరుద్యోగ యువతకు ఉచిత పోలీస్ కానిస్టేబుల్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రజా జాగృతి సమితి అధ్యక్షుడు రాజలింగు మోతె మున్సిపల్ చైర్‌పర్సన్‌కు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజలింగు మోతె మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన అభ్యర్థులు ప్రైవేట్ కోచింగ్ ఫీజులు భరించలేక ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల మున్సిపాలిటీ సామాజిక బాధ్యతగా భావించి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రాత పరీక్షలతో పాటు ఫిజికల్ ట్రైనింగ్, స్టడీ మెటీరియల్, మాక్ టెస్టులు తదితర సౌకర్యాలను ఉచితంగా అందించాలని కోరారు. పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ వచ్చిన ఈ సమయంలోనే ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా మున్సిపాలిటీ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వేల్పుల వెంకటస్వామి, రామిళ్ళ మల్లేష్, ఎట్టం లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ థెరిసా ఉన్నత పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ వేడుకలు

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11:**

జిల్లాలోని తాండూర్ మండలం రేపల్లెవాడలోని సెయింట్ థెరిసా ఉన్నత పాఠశాలలో బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడంతో పాటు, పండుగల విశిష్టతను తెలియజేసేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలు సమర్పించడం, అమ్మవారి, పోతురాజుల వేషధారణ, బోనాల పాట లపై నృత్య ప్రదర్శన సాంస్కృతిక కార్యక్రమాలతో అందరిని ఆకట్టుకున్నారు. పాఠశాల ఆవరణలో భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ ఆంటోనీ, వైస్ ప్రిన్సిపాల్ ప్రిన్స్ సర్, ఆఫీస్ అకౌంటెంట్ సలోమి టీచర్ లు మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.



విద్యార్థులలో సాంస్కృతిక విలువలు, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ తోటల్లో వీవిల్ విడుదల.....



**మెదక్, ఆగస్టు 11(అక్షర కలం):**

మెదక్ జిల్లా హవేలీఘనపూర్ మండలంలోనిఅ ప్రభు వరగౌడ్ ఆయిల్‌పామ్ తోటల్లో పరాగ సంపర్కం కోసం ఉద్యాన శాఖ అధికారులచే ఎలిడోబియస్ కెమెరోనికస్" వీవిల్‌లి ను విడుదల చేశారు. దీని వలన ఫలదీకరణ జరిగి గెలల ఏర్పాటు మెరుగుపడి దిగుబడి పెరుగుతుందని ఉద్యానవనాధికారి ప్రతాప్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీ జె. ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ రైతులు ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించి వీవిల్ వదలడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతులు ఎప్పటికప్పుడు ఉద్యాన అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి జె. ప్రతాప్ సింగ్, హవేలీ ఘనపూర్ వ్యవసాయ అధికారి బాల్ రెడ్డి, ఉద్యాన అధికారి రచన, లీవ్ పామ్ కంపెనీ మేనేజర్ కృష్ణ, కంపెనీ ప్రతినిధులు, వ్యవసాయ విస్తరణ అధికారిణి పాల్గొన్నారు.

## పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. పంద్రాగస్టు సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించనున్న ఈ వేడుకకు సంబంధించి వేదిక, పారిశుధ్యం, త్రాగు నీరు, సీటింగ్, తదితర ఏర్పాట్లను పక్కాగా చేసుకోవాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. వివిధ శాఖల పనితీరును చాటేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రొటోకాల్ ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పంద్రాగస్టు వేడుకకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది విధిగా హాజరు కావాలన్నారు. ఎక్కడ కూడా జాతీయ పతాకం గౌరవానికి భంగం వాటిల్లకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రశంసాపత్రాల బహూకరణ కోసం శాఖల వారీగా ఉత్తమ సేవలను అందించిన ఉద్యోగుల పేర్లతో కూడిన ప్రతిపాదనలను నిర్ణీత గడువు లోపు పంపించాలని ఆదేశించారు.



ప్రభుత్వం ఈనెల 15 నుంచి అర్హులైన వారందరికీ స్మార్ట్ రేషన్ కార్డులను ముఖ్య అతిథి చేతుల మీదుగా అందజేసేందుకు నిర్ణయించినందున సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. కొత్తగా చేయూత పెన్షన్లను కూడా అర్హులైన లబ్ధిదారులకు అందజేసేందుకు ప్రభుత్వం అవసరమైన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. పెన్షన్ల కోసం ఇదివరకు దరఖాస్తు చేసుకున్న వాళ్లు ప్రస్తుతం కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదన్నారు. ఈనెల 31వ తేదీలోగా అర్హులైన వారందరూ పెన్షన్ల కోసం సంబంధిత వెబ్సైట్లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు. దరఖాస్తు చేసుకునే వారికి అవసరమైన ధ్రువపత్రాలను జారీ చేయడంలో అలసత్వం చూపకుండా నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు : ఎస్పీ టి. శ్రీనివాసరావు

**గద్వాల్ టౌన్ అక్షర కలం:**

జోగులాంబ గద్వాల జిల్లాలో నేరాల నియంత్రణకు మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తుతో నేరస్తులకు చట్టపరంగా శిక్ష పడేలా, బాధితులకు సత్వర న్యాయం అందేలా పనిచేయాలని జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్.అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మంత్లీ క్రైమ్ రివ్యూ సమావేశంలో జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, నేరాల నియంత్రణ చర్యలను ఎస్పీ సమీక్షించారు. సీసీటీఎన్ఎస్ (2.0)ను సమర్థవంతంగా వినియోగించాలని, ప్రతి



కేసును సకాలంలో నమోదు చేసి, దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న టూల్స్, ఫీచర్లను పూర్తిస్థాయిలో వినియోగించి పోలీసింగ్‌లో పారదర్శకత, వేగం, సేవల నాణ్యతను పెంచాలని ఆదేశించారు. సైబర్ మోసాలు, ఆర్థిక నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, అక్రమ ఇసుక, గంజాయి రవాణా, రాణా రైస్, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లను గుర్తించి, సంబంధిత శాఖలతో సమన్వయంతో శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠినంగా వ్యవహరించాలని, ట్రాఫిక్ నిర్వహణను మరింత మెరుగుపరచాలని ఆదేశించారు. డయల్ 100 స్థానంలో కొత్తగా లాంచ్ చేసినటువంటి డయల్ 112 అత్యవసర సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచిస్తూ, అత్యవసర సమయంలో పోలీస్, అంబులెన్స్, ఫైర్ సేవలను వేగంగా పొందేందుకు డయల్112 ను వినియోగించుకునేలా ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల వ్యవస్థను విస్తరించి, అవి నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని తెలిపారు. సీసీ కెమెరాల వినియోగం ద్వారా ప్రాపర్టీ నేరాల నియంత్రణతో పాటు నేరాల ఛేదన మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కె. శంకర్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## పెండింగ్లో ఉన్న సీఎంఆర్ ను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలి..

**మిల్లింగ్, రవాణా, గిడ్డంగులలో ఉన్న సమస్యలను తొలగించాలి..**

**కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోడిపల్లి గోపాల్ రెడ్డి**

జగిత్యాల ఆగస్టు 11 : (అక్షర కలం) జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పెండింగ్లో ఉన్న సీఎంఆర్ ను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని, మిల్లింగ్, రవాణా, గిడ్డంగులలో ఉన్న సమస్యలను తొలగించాలని కోరుతూ కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోడిపల్లి గోపాల్ రెడ్డి బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు తిరుపతిరెడ్డి లా ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత కు వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా కిసాన్ మోర్చా



రాష్ట్ర అధికార ప్రతినిధి కోడిపల్లి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు వరి పంట ఎక్కువ పండించారు..దానిని పెద్ద మొత్తంలో ప్రభుత్వం కొనుగోలు చేసింది..అయితే కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి (సి ఎం ఆర్) భారత ఆహార సంస్థ నిర్దిష్టమైన గడువు లోపల పంపించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పై ఉంది..అయితే గత మూడు సంవత్సరాల కాలంలో భారత ఆహార సంస్థకు సరఫరా చేయాల్సిన సిఎంఆర్ లక్ష్యం పూర్తిగా చేరలేదు.. కావున ఇప్పటివరకు సరఫరా చేసిన ధాన్యం ఎంత..? ఇంకా రాష్ట్ర ప్రభుత్వ గిడ్డంగులలో పెండింగ్లో ఉన్న ధాన్యం నిల్వలు ఎన్ని..? పెండింగ్లో ఉన్న సీఎంఆర్ ను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలి.. మిల్లింగ్, రవాణా, గిడ్డంగులలో ఉన్న సమస్యలను తొలగించాలి..

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955